RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 28 | గురువారం, ఫిబ్రవరి 22, 2024 | పేజీలు : 4

### కల్యాణ్ స్టేషన్‌లో 54 డెటోనేటర్లు లభ్యం

థాణె : మహారాష్ట్ర థాణె జిల్లాలో కల్యాణ్ రైల్వే స్టేషన్‌లో ఒక ప్లాట్‌ఫామ్‌పై ఎవరో వదలివేసిన రెండు పెట్టెల్లో 50కి పైగా డెటోనేటర్లు లభ్యమైనట్లు ప్రభుత్వ రైల్వే పోలీస్ (జిఆర్‌పి) అధికారి ఒకరు తెలిపారు. సెంట్రల్ రైల్వే (సిఆర్)లో సాధారణంగా రద్దీగా ఉండే నంబర్ 1 ప్లాట్‌ఫామ్‌పై ఎవరో వదలివేసిన ఆ పెట్టెలను జిఆర్‌పి సిబ్బంది చూసినట్లు ఆయన తెలియజేశారు. ఆ వెంటనే జాగిలాల బృందాన్ని, బాంబు శోధన, నిర్వీర్య బృందం (బిడిడిఎస్)ను ఆ ప్రదేశానికి పిలిపించినట్లు ఆయన తెలిపారు. బిడిడిఎస్ బృందం ఆ పెట్టెలను స్వాధీనం చేసుకుని తెరచి చూడగా 54 డెటోనేటర్లు కనిపించాయని ఆయన తెలిపారు.

## సీఎం రేవంత్ నియోజకవర్గం కొడంగల్‌కు మహర్దశ..

# రూ. 4వేల కోట్లతో భారీ ప్లాన్స్

కొడంగల్: అప్పట్లో గజ్వేల్, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు మహర్దశ పడితే ఇప్పుడు కొడంగల్ నియోజకవర్గానికి రాజ యోగం పట్టనుంది. గత బీఆర్ఎస్ సర్కార్‌లో నాటి సీఎం కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్, అప్పట్లో మంత్రిగా పనిచేసిన కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్ల నియోజకవర్గాలకు వీఐపీ ట్రీట్‌మెంట్ ఉండేది. ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం కావడంతో ఆయన సొంత నియోజకవర్గం కొడంగల్‌కు మహర్దశ పట్టింది. ఇప్పటికే కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు అయింది. ఇక ఇవాళ ఫస్ట్ టైమ్ సీఎం హోదాలో నియోజకవర్గానికి వెళుతున్న సీఎం రేవంత్. రూ. 4 వేల కోట్ల విలువైన 71 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. కరువు పీడిత కొడంగల్-నారాయణపేట-మక్తల్ నియోజకవర్గాల పరిధిలోని లక్ష ఎకరాలకు సాగు నీరు ఇచ్చే నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ ఇవాళ శంకుస్థాపన చేయనున్నారు. 2009లో తొలిసారి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఈ పథకం సాధనకు రేవంత్ ఎంతో ప్రయత్నించారు. ఆయన పోరాటంతో 2014లోనే ఈ పథకం అమలు చేయాలని అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ జీవో కూడా జారీ చేశారు. రూ.2945.50 కోట్లు ఖర్చయ్యే ఈ పథకానికి పరిపాలన పరమైన అనుమతులు ఇస్తూ తెలంగాణ సర్కార్, ఈ నెల 8న జీవో జారీ చేసింది. దీంతోపాటు ఆర్ అండ్ బీ, విద్యా, వైద్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, పంచాయతీరాజ్, విద్యుత్, పట్టణాభివృద్ధి, పశుగణాభివృద్ధి శాఖల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు.

### కొడంగల్ రహదారులకు మహర్దశ

కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో రూ. 45 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్, వికారాబాద్ జిల్లాలో సింగిల్ లేన్‌గా ఉన్న రహదారులను డబుల్ లేన్ రోడ్లుగా మార్చడం, పలు ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు రేవంత్ శంకుస్థాపన చేస్తారు. ఇక కొడంగల్ టీఎంఆర్ స్కూల్‌కు శాశ్వత భవనాల నిర్మాణం, నియోజకవర్గం పరిధిలోని తండాలు, గిరిజన ప్రాంతాలను అనుసంధానించే రహదారుల పనులు, కొడంగల్‌లో హాస్టల్ బిల్డింగ్ నిర్మాణం పనులు, సీసీ రోడ్ల పనులకు సీఎం శ్రీకారం చుడతారు.

### మెడికల్, నర్సింగ్, ఫిజియో థెరపీ కాలేజీలు

ఇక కొడంగల్‌లో గవర్నమెంట్ మెడికల్ కాలేజి, నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఫిజియో థెరపి కళాశాలలకు సీఎం శంకుస్థాన చేస్తారు. కొడంగల్‌లోని సామూహిక ఆరోగ్య కేంద్రాన్ని...220 పడకల సామర్థ్యంగల బోధన ఆసుపత్రిగా మార్చే పనులకు కూడా రేవంత్ శ్రీకారం చుడతారు. వీటి నిర్మాణంతో కొడంగల్, నారాయణపేట్‌తో పాటు సమీప నియోజకవర్గాల్లోని లక్షలాదిమంది ప్రజలకు వైద్య సేవలు చేరువ కానున్నాయి. రూ.360 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న ప్రభుత్వ వెటర్నరీ కాలేజీకి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.



### జూనియర్, ఇంజినీరింగ్ కాలేజీ పనులు

ఇక దౌల్తాబాద్, బొంరాస్‌పేట్‌లో జూనియర్ కాలేజీ భవనాల పనులకు ముఖ్యమంత్రి ఇవాళ శంకుస్థాపన చేస్తారు. దౌల్తాబాద్ మండలం నీటూరులో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ స్కూల్, జూనియర్ కళాశాల భవనాలు, కోస్గిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల భవనాల నిర్మాణ పనులు సీఎం చేతుల మీదగా శ్రీకారం చుట్టుకుంటాయి. కోస్గిలో నిర్మించే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవనం, మద్దూర్‌లో నిర్మించే టీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్‌జేసీ, కొడంగల్‌లో నిర్మించనున్న టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జేసీ భవనాల పనులకు శంకుస్థాపనలు ఉంటాయి. అలాగే కొడంగల్ నియోజకవర్గ పరిధిలో హై లెవెల్ బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల పనులు, దుద్యాల మండలం హస్నాబాద్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు.

## మహబూబ్ నగర్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిని ప్రకటించిన సిఎం రేవంత్



హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ తొలి అభ్యర్థి పేరును టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. బుధవారం కోస్గీలో జరిగిన సభలో సిఎం కీలక ప్రకటన చేశారు. కల్వకుర్తి మాజీ ఎంఎల్ఎ వంశీ చంద్ రెడ్డిని మహబూబ్ నగర్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా ప్రకటించారు. ఆయనను 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం నారాయణ పేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఇప్పటికే వంశీ చంద్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలో పాదయాత్ర చేపట్టి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మహబూబ్ నగర్ ఎంపి టికెట్ ఆయనకే ఫిక్స్ అని వార్తలు వినిపించగా, సిఎం రేవంత్ రెడి బుధవారం అధికారికంగా ప్రకటించారు. దీంతో మహబూబ్ నగర్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు తెరపడింది.

## రణరంగంగా రైతుల ఢిల్లీ చలో...

### యువ రైతు మృతి



చండీగఢ్ : తమ తీరని డిమాండ్ల సాధనతో ఢిల్లీ వైపు సాగిన రైతుల ఢిల్లీ చలో ఆందోళన బుధవారం తీవ్రస్థాయి ఉద్రిక్తతల నడుమ ఆరంభమైంది. హర్యానా సరిహద్దులలో కనౌరీ వద్ద హర్యానా భద్రతాబలగాలకు రైతులకు జరిగిన ఘర్షణలో ఓ 21 సంవత్సరాల రైతు శుభ్‌కరణ్ సింగ్ మృతి చెందాడు. ఈ ప్రాంతంలోనే పరిస్థితి పూర్తిగా చేయిదాటి రణరంగాన్ని తలపించింది. పంజాబ్ నుంచి తరలివచ్చిన రైతులను హర్యానా సరిహద్దుల్లోని శంభు, కనౌరీ వద్ద పోలీసులు, భద్రతా బలగాలు అటకాయించారు. దీనిని రైతులు ప్రతిఘటించారు. ముందుకు సాగేందుకు యత్నించారు. దీనితో వీరిని చెదరగొట్టేందుకు హర్యానా పోలీసులు వారిపై భాష్పవాయువు ప్రయోగించారు. పలు భద్రతా వలయాలను ఛేదించుకుంటూ, బారికేడ్లను తీసివేస్తూ రైతులు ముందుకు సాగడంతో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు రణరంగం అయింది. వీరిని నిలువరించేందుకు మధ్యాహ్నానికి మూడు సార్లు భాష్పవాయువు ప్రయోగించారు.

ఇక్కడనే టియర్‌గ్యాస్ ప్రయోగానికి డ్రోన్లను కూడా వాడారు. దీనితో రైతులు భాష్పవాయువు నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయాల్సి వచ్చింది. కనౌరిలో కూడా పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. రైతులను చెదరగొట్టారు.

### కేసీఆర్ హైదరాబాద్‌ను...

## అభివృద్ధి చేశారు

### : సీఎం రేవంత్



హైదరాబాద్ : రాజకీయాలు ఎలా ఉన్నా కేసీఆర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని సీఎం రేవంత్ అన్నారు. కేసీఆర్ కంటే ముందున్న ముఖ్యమంత్రులు వైఎస్, చంద్రబాబు కూడా హైదరాబాద్‌ను డెవలప్ చేశారని తెలిపారు. హోటల్ వెస్టిన్‌లో సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో విద్య, నైపుణ్యాభివృద్ధి - వ్యవస్థాపక అవకాశాలు అంశంపై నిర్వహించిన సమావేశంలో రేవంత్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడాలన్నదే తమ విధానం అని రేవంత్ స్పష్టం చేశారు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటాం. అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం గత పాలకులు తీసుకున్న మంచి నిర్ణయాలను కొనసాగిస్తాం అని స్పష్టం చేశారు. తెలంగాణలో విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో సీఐఐతో కలిసి ముందుకు నడుస్తాం అని సీఎం చెప్పారు. 64 ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా రూ.2000 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నాం అని తెలిపారు. స్కిల్లింగ్ యూనివర్సిటీల ఏర్పాటు కోసం సంప్రదింపులు జరుపుతున్నాం.

## ఇదేమి రామ రాజ్యం: రాహుల్ గాంధీ ఫైర్



కాన్పూర్/ఉన్నావ్: దేశ జనాభాలో 90 శాతం ఉన్న దళితులు, ఇతర వెనుకబడిన తరగతులకు ఉద్యోగాలను బిజెపి నేతృత్వంలోని కేంద్రం సృష్టించడం లేదని, మోడీ 'రామ రాజ్యం'లో వారిపై వివక్ష సాగుతోందని కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ బుధవారం ఆరోపించారు. 'ఇది ఏమి రామ రాజ్యం? మొత్తం జనాభాలో దాదాపు 90 శాతం ఉన్న వెనుకబడిన తరగతులు (బిసిలు), దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు ఉద్యోగాలకు ఉద్యోగాలు దక్కవు' అని రాహుల్ ఆక్షేపించారు. తన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా బుధవారం కాన్పూర్‌లోని ఘంటాఘర్ కూడలిలో ఒక బహిరంగ సభలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ జనాభాలో 50 శాతం మంది బిసిలకు చెందినవారు, 15 శాతం మంది దళితులు, 8 శాతం మంది ఆదివాసీలు, 15 శాతం మంది మైనారిటీలు.. మీరు కోరుకున్న స్థాయిలో కేకలు వేయండి. కానీ ఈ దేశంలో మీకు ఉద్యోగాలు దొరకవు. మీరు వెనుకబడిన, దళిత, ఆదివాసీ లేక పేద సార్వత్రిక కేటగరీకి చెందినవారైతే మీకు ఉద్యోగం లభించదు. మీకు ఉద్యోగాలు రావడం నరేంద్ర మోడీకి ఇష్టం లేదని రాహుల్ అన్నారు. భారత్‌లో వర్గ, కుల అంతరాలు ఏవిధంగా ఉన్నాయంటే దళితులకు, బిసిలకు మీడియాలో గాని, బడా పరిశ్రమలలో గాని, అధికార యంత్రాంగంలో గానీ వారికి ప్రాతినిధ్యం వహించేందుకు ఎవ్వరూ లేరని ఆయన చెప్పారు. దేశంలో జనం ఆకలితో మరణిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మీరు ప్రాణ ప్రతిష్ఠ వేడుక చూశారు. బిసిల నుంచి ఎందరు ఉన్నారు? దళితులు, ఆదివాసీల నుంచి ఎందరు ఉన్నారు? ఆదివాసీ రాష్ట్రపతి (ద్రౌపది ముర్ము)ను కూడా ఆహ్వానించలేదు. దళిత మాజీ రాష్ట్రపతి (రామ్‌నాథ్ కోవింద్)ను ఆలయంలోకి అనుమతించలేదని రాహుల్ ఆరోపించారు. కుల గణన కోసం తమ పార్టీ, మిత్ర పక్షాల డిమాండ్ గురించి రాహుల్ నొక్కిచెబుతూ, అటువంటి సర్వే మాత్రమే దేశంలో వెనుకబడిన తరగతుల సంక్షేమం గురించి, వారి వద్ద ఎంత డబ్బు ఉన్నది తెలుసుకోవడానికి దోహదం చేస్తుందని సూచించారు. 'భారత పురోగతికి అత్యంత పెద్ద విప్లవాత్మక చర్య కులగణనే అని మేము చెప్పాం' అని రాహుల్ తెలిపారు. 2016 పెద్ద నోట్ల చలామణీ రద్దు, జిఎస్‌టి, అగ్నివీర్ పథకంతో సహా పలు నిర్ణయాలకు కేంద్ర ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు.

## సమ్మక్క-సారక్కలకు ప్రణమిల్లుదాం...

### మేడారం జాతరపై ప్రధాని మోదీ ట్వీట్



న్యూఢిల్లీ / హైదరాబాద్:
ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ, తెలంగాణ కుంభమేళగా పిలిచే మేడారం సమ్మక్క సారక్క జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'మేడారం జాతర.. గిరిజనుల అతిపెద్ద పండుగల్లో ఒకటి. ఈ జాతర భక్తి, సంప్రదాయం, సమాజ స్ఫూర్తిల గొప్ప కలయిక. మనం సమ్మక్క-సారక్క లకు ప్రణమిల్లుదాం. వారు అభివ్యక్తీకరించిన ఐక్యతా స్ఫూర్తిని, పరాక్రమాన్ని గుర్తు చేసుకుందాం. మన సాంస్కృతిక వారసత్వానికి చిరకాల స్ఫూర్తిగా నిలిచే ఈ సమ్మక్క-సారక్క మేడారం జాతర ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు' అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. కాగా, తెలంగాణలో అతి పెద్ద మహా కుంభవేళగా భావించే మేడారం మహాజాతర రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. ఈ ఏడాది ఈరోజు నుండి ఈ మహాజాతర మొదలైంది. జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు ఇప్పటికే భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇంకా పెద్ద ఎత్తున భక్తులు వస్తూనే ఉన్నారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా మేడారం తరలి వస్తున్నారు.

సమ్మక్క తనయుడు కన్నెపల్లిలో కొలువైన జంపన్న మంగళవారం రాత్రి 7.09 గంటలకు బయలుదేరి 8 గంటలకు వాగు ఒడ్డున ఉన్న గద్దెపైకి చేరుకున్నాడు. పూజారి పోలెబోయిన సత్యం కన్నెపల్లిలోని ఇంటిలో పూజా సామగ్రిని శుద్ధిచేసిన అనంతరం జంపన్న గద్దెకు అలుకుపూతలు నిర్వహించి ఆయన ప్రతిరూపమైన డాలు, కర్రకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. గ్రామ మహిళలు ఊరు పొడవునా నీళ్లారబోస్తూ జంపన్నను సాగనంపారు.

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలపైకి తెచ్చే ప్రక్రియ ఇవాళ మొదలైంది. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సాయంత్రం ఆరు గంటలకు పూజలు నిర్వహిస్తారు. ఆదివాసీ పూజారులు, మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, ఏఎస్పీలు కలిసి కన్నెపల్లి నుంచి సారలమ్మను మేడారంలోని గద్దెల వద్దకు తీసుకొస్తారు.

# సంపాదకీయం

## ఫ్రెంచ్ పాత్రికేయురాలి కన్నీటి నిష్క్రమణ

భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండడమే ప్రజాస్వామ్యం. భారత ప్రభుత్వం ఒక ఫ్రెంచ్ పాత్రికేయురాలికి ఈ స్వేచ్ఛను నిరాకరించింది. ఈ దేశం నుంచి వెళ్లిపోవలసిన అగత్యాన్ని కల్పించింది. పలు ఫ్రెంచ్ మీడియా సంస్థల దక్షిణాసియా ప్రతినిధిగా మన దేశంనుంచి పనిచేస్తున్న వనెసా డౌనక్ శుక్రవారం స్వదేశానికి వెళ్లిపోయారు. తన ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం పత్రికాస్వేచ్ఛను అణచివేసేందుకు రాజ్య వ్యవస్థ కృతనిశ్చయంతో ఉన్నదని వనెసా ఉదంతం స్పష్టం చేసింది. ఆమె 25 సంవత్సరాల క్రితం ఒక విద్యార్థినిగా మన దేశానికి వచ్చి, భారతీయుడైన సహపాఠిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కుమారుడిని భారతీయ పౌరుడుగా తీర్చిదిద్దుతున్నారు. జీవనోపాధికి పాత్రికేయ వృత్తిని చేపట్టి స్వదేశానికి తిరిగి వెళ్లిపోయేంతవరకు అదే వృత్తిలో కొనసాగారు. సత్యనిష్ఠతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారు. ఆ నిబద్ధతవల్లే, ఇప్పుడు తాను ప్రేమించే దేశానికి, సొంత కుటుంబానికి దూరమవాల్సి వచ్చింది. తన వృత్తి నిర్వహణలో భాగంగా ఆమె మానవ హక్కులు, దేశీయ రాజకీయాలు, గ్రామీణ భారతంలో మావోయిస్టుల పార్టీ కార్యకలాపాల గురించి వివిధ ఫ్రెంచ్ పత్రికలకు వార్తా కథనాలు రాశారు. కరోనా మహమ్మారి దేశాన్ని కుదిపేస్తున్నప్పుడు ప్రభుత్వం తీరు, గంగానదిలో మృతదేహాలు ఇత్యాది పలు పరిణామాలను లోతుగా విశ్లేషించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు సంబంధించిన వివిధ హింసాత్మక ఘటనలను నివేదించారు. ఒక భారతీయ పౌరుడి సతీమణిగా ఆమెకు భారత్‌లో శాశ్వత నివాసానికి హక్కునిచ్చే 'ఓవర్సీస్ సిటిజెన్‌షిప్ అఫ్ ఇండియా (ఒసిఐ) కార్డు ఉన్నది. 2022 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వం వనెసాకు జర్నలిజం పర్మిట్ రద్దు చేసింది. ఒఐసి కార్డు ఉపసంహరణకు నిర్ణయించినట్టు హోం మంత్రిత్వశాఖ జనవరి 24న నోటీస్ ఇచ్చింది. ఆమె పాత్రికేయ కార్యకలాపాలు 'ద్రోహ చింత'తో ప్రభావితమవుతున్నాయని, అవి భారత్ పట్ల వ్యతిరేక అభిప్రాయాన్ని కలిగించే విధంగా ఉంటున్నాయని హోం శాఖ ఆరోపించింది. ఈ ఆరోపణలకు సమాధానమిచ్చేందుకు ఫిబ్రవరి 2 వరకు గడువు ఇస్తున్నట్టు నోటీస్‌లో పేర్కొన్నారు. 1955 భారత పౌరసత్వ చట్టం నిర్దేశించిన విధంగా ప్రత్యేక అనుమతి తీసుకోకుండా పాత్రికేయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు, ఆ నిబంధనలను ఉల్లంఘించినట్టు ఆ నోటీస్ ఆరోపించింది. ఈ ఆరోపణలను వనెసా ఖండించారు. ఇవన్నీ ఎలాంటి రుజువులు లేని ఆరోపణలని శుక్రవారం నాడు స్వదేశానికి వెళ్లిపోతూ జారీ చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వృత్తిని మార్చుకోవాలని హోం శాఖ అధికారులు గతంలో ఇచ్చిన సలహా తనకు ఆమోదయోగ్యం కాదని, నిరూపించని ఆరోపణల కారణంగా తనకు ఇష్టపూర్వకమైన పాత్రికేయ వృత్తిని త్యజించేందుకు సిద్ధంగాలేనని, బలవంతంగా దేశాన్ని విడిచిపోవలసివస్తున్నదని ఆ సుదీర్ఘ వీడ్కోలు ప్రకటనలో ఆమె తెలిపారు. బాధాతప్త హృదయంతో, కన్నీటితో ఈ మాటలు రాస్తున్నాను. ఈ రోజు భారత్ వదిలివెళ్లిపోతున్నాను. పాతికేళ్ళ క్రితం ఒక విద్యార్థిగా ఈ దేశానికి వచ్చాను, 23 సంవత్సరాలు ఈ దేశంలోనే పాత్రికేయురాలుగా పని చేశాను. ఈ దేశ పౌరుడినే వివాహం చేసుకున్నాను. నా కుమారుడిని ఇక్కడే పెంచాను. నేను నా ఇల్లుగా భావించిన దేశమిది. అయినా ఈ దేశాన్ని విడిచి వెడుతున్నాను. ఈ నిష్క్రమణ నా నిర్ణయం కాదు. ఈ దేశాన్ని వదిలిపోయేలా భారతప్రభుత్వం నన్ను బలవంతపెట్టింది. పాత్రికేయురాలుగా పనిచేసేందుకు నాకున్న హక్కును పదహారు నెలల క్రితం హోంమంత్రిత్వ శాఖ నిరాకరించింది. ఎందుకు నిరాకరిస్తున్నదీ కారణాలు తెలుపలేదు. న్యాయసమర్థనలను చూపలేదు. నా విన్నపాలను వినినే లేదు. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్హేతుక చర్యపై పునరాలోచించాలని, కనీసం వివరణ ఇవ్వాలని నేను పదే పదే చేసిన అభ్యర్థనలకు హోం మంత్రిత్వ శాఖ ఒక్కసారీ ప్రతిస్పందించలేదు. గత నెలలో నాకు ఒక నోటీస్ పంపారు.

# సైబరాబాద్‌లో ఎస్‌సిటిపిసిఎస్ బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ప్రారంభం

- శిక్షణలో సంస్థాగత విలువలను పాటించాలి
- వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి





**సైబరాబాద్ కమిషనరేట్ (గరుడ వార్త) :** సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని పరేడ్ గ్రౌండ్లో ) సివిల్ SCTPCs (స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్/Stipendiary Cadet Trainee Police Constables)ల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు ముఖ్య అతిథిగా సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్., విచ్చేసి ప్రసంగించారు. సివిల్ SCTPCsలు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్., అన్నారు. 2024వ బ్యాచ్ కు చెందిన సిద్దిపేట, మెదక్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం 4 యూనిట్ లకు చెందిన 196 మంది సివిల్ SCTPCs ఈ నెల 21వ తేదీన సైబరాబాద్ లోని కమాండ్ ట్రైనింగ్ సెంటర్ లో రిపోర్ట్ చేశారు. వీరిలో సిద్దిపేట యూనిట్ కు చెందిన 59 మంది, మెదక్ యూనిట్ కు చెందిన 56 మంది, ఖమ్మం యూనిట్ కు చెందిన 54 మంది, భద్రాద్రి కొత్తగూడెం యూనిట్ కు చెందిన 27 మంది ఉన్నారు. వీరందరికీ సైబరాబాద్ సీటీసీ లో 9 నెలల ట్రైనింగ్ ఉంటుంది. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ.. SCTPCs స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ను ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. పోలీస్ నోటిఫికేషన్ వెలువడిన అనంతరం పోలీస్ ఉద్యోగ ఉత్తీర్ణత సాధించడం కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు అహోరాత్రులు కష్టపడి చదివి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తారన్నారు. అందులో కొందరికే ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందన్నారు. మీరూ అందులో ఉన్నారన్నారు. తెలంగాణ పోలీసులకు బెస్ట్ పోలీస్ గా దేశం లోనే సముచిత స్థానం ఉందన్నారు. ప్రస్తుతం ట్రైనింగ్ లో ఉన్న SCTPCsలు ఖ్యాతిని ఉన్నతంగా నిలబెట్టాలన్నారు. కొత్త విషయాలను నేర్చుకోవడానికి ట్రైనింగ్ సమయం చక్కని అవకాశం అన్నారు. స్వీయ క్రమశిక్షణను పాటించాలి. నూతనంగా సెలెక్ట్ అయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీసు శాఖ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. పోలీస్ వృత్తి ఉన్నతమైనదన్నారు. నిరంతరం ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ట్రైనింగ్ సమయంలో ఇండోర్, అవుట్ డోర్ ట్రైనింగ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవుట్ డోర్ ట్రైనింగ్ లో భాగంగా యోగా, మెడిటేషన్, స్పోర్ట్స్, డ్రిల్, ట్యాక్టికల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, జీపీఎస్, వెపన్ ట్రైనింగ్ తదితర యాక్టివిటీస్ ఉంటాయన్నారు. ఇండోర్ ట్రైనింగ్ లో భాగంగా చట్టాలపై అవగాహన, లా అండ్ ఆర్డర్, సెక్యూరిటీ, పిటిషన్లు రాయడం, క్రైమ్ నంబర్లు, సెక్షన్ లు, పోలీస్ అడ్మినిస్ట్రేషన్, జెండర్ సెన్సిటైజేషన్, వ్యక్తిత్వ వికాసం, కంప్యూటర్ ట్రైనింగ్ తదితర అంశాలపై తర్ఫీదునిస్తారన్నారు. ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేసి యూనిట్ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. సమర్థత, వృత్తి నైపుణ్యం, నీతి నిజాయితీ తో విధులు నిర్వర్తించాలన్నారు.

అనంతరం సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డేవీస్, ఐపీఎస్., మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగాన్ని సాధించిన అభ్యర్థులందరిని అభినందించారు. ఈ 9 నెలల ట్రైనింగ్ పైనే మిగతా సర్వీస్ మొత్తం ఆధారపడి ఉంటుందన్నారు. ట్రైనింగ్ రూల్స్ అండ్ రేగులేషన్స్ అన్నీపాటించాలన్నారు. సోషల్ మీడియా పట్ల జాగ్రత వహించాలన్నారు. కానిస్టేబుళ్లు క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై పని చేస్తారని, పోలీస్ డెపార్ట్ మెంట్ లో వారి పాత్ర కీలకమన్నారు. సీటీసీ లో ఇప్పటివరకు వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులకు ట్రైనింగ్ ఇచ్చారన్నారు. ట్రైనింగ్ లో కొత్త విషయాలను నేర్చుకునే ప్రయత్నం చేయాలన్నారు. ట్రైనింగ్ లో ఏవైనా ఇబ్బందులు ఉంటే ట్రైనీ అభ్యర్థుల కోసం గ్రీవియెన్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం డీసీపీ సిటిసి ప్రిన్సిపల్ LC నాయక్ మాట్లాడుతూ.. 2008 లో సైబరాబాద్ లో సిటిసి ని ఏర్పాటు చేశారన్నారు. నాటి నుంచి విజయవంతంగా 5 బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ లు పూర్తి చేశామన్నారు. ట్రైనీ కానిస్టేబుళ్ల విజయవంతంగా ట్రైనింగ్ పూర్తి చేసి సైబరాబాద్ సీటీసీ కి మంచి పేరు తీసుకురావాలన్నారు. ట్రైనింగ్ లో సమయాన్ని వృథా చేయకుండా వివిధ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం సీటీసీ ఏడీసీపీ వైస్ ప్రిన్సిపల్ రామచంద్రుడు మాట్లాడుతూ ట్రైనింగ్ ని క్రమశిక్షణ తో పూర్తి చేసి తెలంగాణ పోలీస్ వ్యవస్థకు వన్నె తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్., సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డేవీస్, ఐపీఎస్., సిటిసి డీసీపీ ప్రిన్సిపల్ LC నాయక్, సిటిసి వైస్ ప్రిన్సిపల్ ఏడీసీపీ రామచంద్రుడు, ఏడీసీపీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ షమీర్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏసీపీ ఇంద్రవర్ధన్, సిటిసి ఏసీపీ గంగారాం, సిటిసి ఇన్ స్పెక్టర్లు భాస్కర్, బాలరాజు, ఆర్ఐ లు, ఎస్ఐలు, సీటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిడిపి, ఎంపీ, ఎస్‌డిఎఫ్, సిబిఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి: జిల్లా కలెక్టర్ గౌతం

**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త):** ఎంపీ ల్యాండ్స్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులలో అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రోజున వి.సి మీటింగ్ హాల్లో ఎంపీ లాండ్స్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో (సిడిపి , ఎంపీ, ఎస్ డి ఎఫ్, సి బి ఎఫ్) చేపట్టిన పనుల పురోగతి పై జిల్లా ప్రణాళికా అధికారి మోహన్ రావు, తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎక్కడ కూడా పనులు పెండింగ్ లో ఉండకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనులను చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా నియోజకవర్గ అభివృద్ధి నిధులు (కాన్సిట్యూషన్సీ డెవలప్మెంట్ ఫండ్స్ – సీడీఎఫ్) పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (మెంబెర్ అఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్మెంట్ – ఎంపీ ల్యాడ్స్) క్రుషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సీబీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు (స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ – ఎస్డీఎఫ్)కు సంబంధించి జిల్లాలోని రహదారులు భవనాలు, పంచాయతీరాజ్, అటవీ శాఖ , జిల్లా అభివృద్ధి నిధులు, డీడబ్ల్యువో, డీఆర్డీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అధికారులు అందరూ



సమన్వయంతో పని చేయాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయగలరని సూచించారు. ఎం పి ల్యాండ్స్ నియోజక వర్గ అభివృద్ధి నిధులతో చేపట్టి అసంపూర్తిగా ఉన్న పనులను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు అధికారులతో అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. టెండర్ ప్రక్రియలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తి అయ్యాయని పెండింగ్ లో ఎన్ని ఉన్నాయని రద్దు చేసినవి ఎన్ని తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. పనులు పూర్తి చేయడం జరిగిందని, ఇంకా ఎన్ని పనులు ఏఏ స్థాయిలో పెండింగ్ లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు . పూర్తిగా క్యాన్సల్ అయినవి ఎన్ని అనే వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులకు సంబంధించిన యూటిలైజెషన్ సర్టిఫికెట్ లను సిపిఓకు పంపాలని అన్నారు. తదుపరి సమావేశానికి అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ, సీలింగ్ భూములు అన్నిటికి గూగుల్ మ్యాప్ రూపొందించండి

- ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టండి: జిల్లా కలెక్టర్ గౌతమ్



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) :** ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు అన్నిటిని గుర్తించి గూగుల్ మ్యాప్ తయారు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రోజున విసి మీటింగ్ హాల్లో ఆర్డీవోలు, ఎమ్మార్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో ఉన్న సీలింగ్ భూములు అన్నింటిని ధరణిలో క్రయవిక్రయాలు జరగకుండా చూడాలన్నారు. కోర్టుకేసులు పెండింగ్ లో ఉన్నా వాటిని కౌంటర్ ఫైల్ చేయమని తహశీల్దార్లకు ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ ల్యాండ్ లను కాపాడవలసిందిగా కలెక్టర్ కోరారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల యొక్క గూగుల్ మ్యాప్ ను తయారు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఓ ఆర్ ఆర్ చుట్టూ ఇండస్ట్రియల్ పార్కు స్థాపించడానికి గవర్నమెంట్ పార్సిల్ గుర్తించమన్నారు. మండల పరిధిలోని పెండింగ్ లో ఉన్న టీఎస్ బి పాస్ దరఖాస్తులను పరిశీలించి పంపవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్డీవో శ్యాంప్రకాష్, మండల తహశీల్దార్ లు పాల్గొన్నారు.

# జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి, పబ్లిక్ పరీక్షలు-2024, సజావుగా నిర్వహించేలా చర్యలు

- విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి - మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) :** జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్, పదో తరగతి, పబ్లిక్ పరీక్షలు-2024. పరీక్షలు సజావుగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టరేట్ ఛాంబర్లో తెలంగాణ ప్రభుత్వం ఇంటర్మీడియట్, పదో తరగతి, పబ్లిక్ పరీక్షలు-2024 కు సంబంధించి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐవో) కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారిణి (డీఈవో) విజయకుమారి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి, పబ్లిక్ పరీక్షలు-2024 నిర్వహణలో అధికారులు సమన్వయంతో తమ విధులు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్ష కేంద్రాలను, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో 65,965, ద్వితీయ సంవత్సరానికి 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. ఈనెల 28వ తేదీ నుంచి మార్చ్ 19 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు, ప్రథమ సంవత్సరం ఉదయం 9. నుండి మధ్యాహ్నం 12:00 వరకు, ద్వితీయ సంవత్సరానికి మధ్యాహ్నం 2.00 నుండి 5.00 వరకు జరుగుతాయని తెలిపినారు. పదో తరగతి పరీక్షలు మార్చ్ 18 నుండి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నారని, 231 పరీక్ష కేంద్రాల లో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు, జిల్లా వ్యాప్తంగా ( రెగ్యులర్ 46834ం ప్రైవేట్ 572) 47406 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సౌకర్యాలను కల్పించాలని, స్ట్రాంగ్ రూం నుండి పరీక్షా కేంద్రానికి తిరిగి పరీక్షా కేంద్రం నుండి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటిరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అవసరమైన పోలీసు



బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల నుండి జవాబు పత్రాలను పగడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని, ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు రాస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి పరీక్షా సమయం కన్నా ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ఎవరికి కూడా అనుమతి లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, రాచకొండ, సైబారబాద్ పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'మద్దతు ధర' : మోదీపై కాంగ్రెస్ అస్త్రం




మోదీ అజేయుడు అనే భావన అందరిలోనూ బలపడిపోతోంది. రాబోయే సార్వత్రక ఎన్నికలలో ఆయన నేతృత్వంలోని బీజేపీ మరోమారు ఘనవిజయం సాధించనున్నదనే అభిప్రాయం దేశవ్యాప్తంగా వ్యక్తమవుతోంది. అయితే మోదీ అజేయశక్తిని గట్టిగా ప్రశ్నించగలిగే, సమర్థంగా ఎదర్కోగలిగే అంశం ఒకటి ఎట్టకేలకు రంగంలోకి ప్రవేశించింది. మోదీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రయోగించిన అస్త్రమది వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర. అవును ఉత్తరాది రైతులను మళ్ళీ మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు పురిగొల్పిన అంశమది. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలచింది. మోదీనా లేక కనీస మద్దతు ధరా? 2014 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, ఆ మాటకొస్తే మన రిపబ్లిక్ భవిష్యత్తు ఈ ఒక్క ప్రశ్నపైనే ఆధారపడి ఉన్నది. తాము అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇది సరైన నిర్ణయం, సందేహం లేదు.

అయితే అది మరింత ప్రభావవంతమయ్యేందుకు మరింత ముందుకు వెళ్లవలసి ఉన్నది. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర అంబికాపూర్ (ఛత్తీస్‌గఢ్‌లోని ఒక చిన్నపట్టణం)కు చేరిన సందర్భంగా అక్కడ జరిగిన ఒక బహిరంగ సభలో కాంగ్రెస్ నిర్ణయాన్ని ప్రపకటించారు. స్వామినాథన్ కమిషన్ సూత్రం ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించే కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పి)కి చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ఆ సభలో ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రప్రథమంగా చేసిన కీలక ప్రకటన ఇది. ఈ ప్రకటనకు కీలక ప్రాధాన్యమున్నదనే వాస్తవాన్ని ఏ రాజకీయ పరిశీలకుడూ నిరాకరించలేడు. కనీస మద్దతు ధర విషయమై తాను అధికారంలో ఉన్నప్పుడూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరించిన వైఖరికి కాంగ్రెస్ తాజా నిర్ణయం భిన్నమైనది. నిజానికి కనీస మద్దతు ధర విషయమై కాంగ్రెస్ ప్రస్తుత విధానాన్ని 2022లో రాయపూర్ ప్లీనరీ తీర్మానం సూచనప్రాయంగా వ్యక్తం చేసింది. అయితే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని చాలా కాలంగా రైతులు చేస్తున్న డిమాండ్‌ను నెరవేర్చడానికి కాంగ్రెస్ తిరుగులేని రీతిలో నిబద్ధమవడం ఇదే మొదటిసారి. అంతేకాదు, రైతుల ప్రాథమిక డిమాండ్ అయిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంలోని మూడు కీలక అంశాలకు ఒక ప్రధాన జాతీయ రాజకీయ పక్షం కట్టుబడడం ఇదే మొదటిసారి. కనుక కాంగ్రెస్ ప్రకటన రైతాంగ ఉద్యమ చరిత్రలో ఒక ప్రధాన మైలురాయిగా చెప్పవచ్చు. రైతుల డిమాండ్‌లోని మూడు కీలక అంశాలు ఏమిటో వివరంగా చూద్దాం. (1) కనీస మద్దతు ధరను నిర్ణయించేందుకు ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతిని 'స్వామినాథన్ సూత్రం'కు అనుకూలంగా మార్చాలి. దీని ప్రకారం పంట సాగుకు అయిన సమగ్ర ఖర్చుల మొత్తానికి యాభై శాతాన్ని అదనంగా కలిపి ఎమ్ఎస్‌పిని నిర్ణయించాలిబీ (2) దీన్ని అధికారంలో ఉన్న ప్రభుత్వాల, వాటి అధికారుల ఇష్టాయిష్టాలకు వదిలివేయకుండా, ఆ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించి తీరాలిబీ (3) కనీస మద్దతు ధరపై ఈ హక్కును రైతులు అందరికీ సమకూర్చాలి. కేవలం ఎమ్ఎస్‌పిని ప్రకటిస్తున్న 23 పంటలను సాగు చేస్తు రైతులకు మాత్రమే ఆ హక్కును పరిమితం చేయకూడదు. రైతుల డిమాండ్‌ను నెరవేర్చేందుకు కాంగ్రెస్ తన నిబద్ధతను ప్రకటించేందుకు ఇంతకంటే సరైన సమయం, సందర్భం ఉండబోవు. రెండు సంవత్సరాలు మౌనంగా ఉన్న తరువాత రైతులు మళ్లీ ఆందోళనకు పూనుకున్నారు. ప్రధాన రైతు సంఘాలు రెండూ ఆందోళనకు పిలుపునిచ్చాయి. ఉద్యమ కార్యాచరణ విషయమై వివిధ రైతు సంఘాల మధ్య ఏకాభిప్రాయం లేనప్పటికీ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే అంశం వాటి డిమాండ్లలో తొలిస్థానంలో ఉన్నది. కాంగ్రెస్ తనకు తాను ఈ శక్తిమంతమైన ఉద్యమానికి మద్దతునిచ్చింది. కాంగ్రెస్ మద్దతు 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయగలుగుతుందా?

మోదీ ప్రభావశీలత, అయోధ్యలో రామ మందిర నిర్మాణ మనంతరం దేశవ్యాప్తంగా ఆయనకు పెరిగిన ప్రజాదరణను కనీస మద్దతు ధర అంశం సమర్థంగా ఎదుర్కోగలదా? పూర్తిగా ఎదుర్కోలేదు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ఒక రాజకీయ కార్యకర్త నాకు ఇలా వివరించాడు: 'చునావి ముద్ద అప్నే ఆప్ బంతా నహీ హై, బనాయ జాతా హై' (ఎన్నికలను ప్రభావితం చేసే అంశం దానికది సొంతంగా ఉద్భవించదు, దాన్ని సృష్టించాలి). ఒక సమస్యను ప్రభావశీల ఎన్నికల అంశంగా మార్చేందుకు కనీసం ఆరు షరతులను నెరవేర్చవలసి ఉన్నది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తానన్న కాంగ్రెస్ ప్రకటన నాలుగు షరతులను నెరవేర్చింది. మిగతా రెండు షరతులను నెరవేర్చే విషయమై ఆ పార్టీ కృషి చేయవలసి వున్నది. రైతుల సమస్యకు ఒక పరిష్కారాన్ని కనుగొనవలసి ఉన్నది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడమనేది అందుకొక పరిష్కారం కాగలదు. ఇందుకు ఎన్నికైన ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉన్నది. ఈ లక్ష్య సాధనకు రైతులను సమీకరించవలసి ఉన్నది. సమస్యేమిటంటే రైతులలో అత్యధికులు ఇప్పటికీ కనీస మద్దతు ధర గురించి వినని లేదు! మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు నిర్వహించిన చరిత్రాత్మక ఆందోళన కనీస మద్దతు ధరను సాధించలేదు. అయితే కనీస మద్దతు ధర అంశాన్ని ప్రతి రైతు కుటుంబానికి సుపరిచితం చేసింది. కేవలం పెద్ద రైతులకు మాత్రమే కాకుండా వ్యవసాయ కుటుంబాలు అన్నిటికీ కనీస మద్దతు ధర గురించి ఆ ఆందోళన తెలియబరిచింది. రైతులకు మాత్రమే కాకుండా ఇతర సామాజిక వర్గాలకు కూడ ఆ సమస్యను ఎరుకపరిచింది. ఎమ్ఎస్‌పిని పొందడమనేది ప్రతి రైతు హక్కు అనేది రైతు ఉద్యమాల కార్యకర్తలకు బాగా తెలుసు. ఆరెస్సెస్‌కు అనుబంధంగా ఉన్న కిసాన్ సంఘ్ నేతలతో సహా రైతు నాయకులు అందరి ఆలోచనలు మూడు పదాల చుట్టూ తిరుగుతున్నాయి. అవి: ఎమ్ఎస్‌పి, స్వామినాథన్, చట్టబద్ధత. కాంగ్రెస్ ప్రకటనకు ఈ మూడు మాటలే ప్రాతిపదిక. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌ను మోదీ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎమ్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌కు ఆయన విశేష ప్రాచుర్యం కల్పించారు. రైతు ఉద్యమం ఈ విషయాన్ని విస్మరించబోదు. రైతుల చరిత్రాత్మక ఆందోళన ముగిసి రెండేళ్లు గడిచినప్పటికీ కనీస మద్దతు ధర విషయమై మోదీ ప్రభుత్వం సానుకూల నిర్ణయాన్ని తీసుకోలేదు ఎన్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించే విషయమై కాంగ్రెస్ హామీ సరైన రాజకీయ సమయంలో ఇచ్చింది. సార్వత్రక ఎన్నికలకు ఇంకా రెండు నెలల వ్యవధి మాత్రమే. ప్రభుత్వం ఈ విషయమై తన వైఖరిని మార్చుకునేందుకు సమయం మించిపోయింది. ఎన్నికల ప్రచార ఘట్టంలో ఈ ఓటర్లు ఈ అంశాన్ని తప్పకుండ గుర్తుంచుకుంటారు. కాంగ్రెస్ హామీని వారు విస్మరించబోరు. మీడియా సైతం రైతుల సమస్యలకు ప్రాధాన్యమివ్వడం అనివార్యమయింది. 'కనీసమద్దతు ధర' అంశం మళ్లీ పతాక శీర్షికల్లో ఉన్నది.

కాంగ్రెస్ ప్రకటన రైతు ఉద్యమ కార్యకర్తలకు కూడా ఇంకా చేరలేదు. ఇక సామాన్య రైతుల గురించి చెప్పేదేముంది? ఢిల్లీ చలో సందర్భంగా పోలీసులతో రైతుల ఘర్షణకు ప్రధాన స్రవంతి మీడియా ప్రాధాన్యమిస్తోంది. అయితే కాంగ్రెస్ ప్రకటన గురించి ప్రస్తావించడం లేదు. మీడియా అలక్ష్యాన్ని అధిగిమించి తన హామీ గురించి ప్రతి రైతుకూ తెలియజేసేందుకు కాంగ్రెస్ మరింత కృషి చేయవలసిన అవసరమున్నది. సరే, మోదీ ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉన్న 'ఆర్థిక వేత్తల'ను కనీస మద్దతు ధరకు చట్టబద్ధత అంశానికి వ్యతిరేకంగా తప్పక మోహరిస్తుంది. ఎమ్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించడం సాధ్యం కాదని మోదీ సర్కార్ ఇప్పటికే ప్రచారం చేస్తోంది. దానివల్ల ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతుందని పదేపదే చెప్పుతోంది. ఇది పచ్చి అబద్ధం. నేను, కిరణ్ విస్సా గతంలోనే ప్రభుత్వ వాదనను ఖండించాం, ఎమ్ఎస్‌పి గ్యారంటీని ఎలా అమలుపరచవచ్చో కవిత కురుగంటి సవివరంగా రాశారు. కనీస మద్దతు ధరను కల్పించి తీరాలి. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తులు అన్నిటిని ప్రభుత్వం సేకరించవలసిన అవసరం లేదు.

కనీస మద్దతు ధరను చట్టబద్ధంగా కల్పించేందుకు పెద్ద మొత్తాన్ని వినియోగించవలసి ఉన్న మాట నిజమే. అయితే ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతుందనడం శుద్ధ అబద్ధం. స్థూల దేశియోత్పత్తిలో ఒక శాతాన్ని రైతులకు ఇవ్వలేరా? ఇది ఎంతో రాజకీయ ప్రాధాన్యమున్న విషయం.

## దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలపై కన్నేసిన ఎంఐఎం అధినేత



లోక్‌సభ ఎన్నికల రాజకీయ ఉత్కంఠతో ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ రంగంలోకి దిగారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో AIMIMకి చెందిన ఇద్దరు ఎంపీలు విజయం సాధించగా, అసదుద్దీన్ అవైసీ హైదరాబాద్ నుంచి, ఇంతియాజ్ జలీల్ ఔరంగాబాద్ నుంచి గెలుపొందారు.

ఈసారి రెండు సీట్లకు పైగా గెలుపొందాలని ఒవైసీ ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందుకోసం ఓ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకున్నారట. హైదరాబాద్, ఔరంగాబాద్‌లతో పాటు ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్న ఒవైసీ.. అభ్యర్థుల ఎంపిక పనిలో బిజీగా ఉన్నారట. 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అసదుద్దీన్ ఒవైసీ తన పర్యటనను ప్రారంభించారు. మహారాష్ట్ర నుంచి బీహార్‌లోని సీమాంచల్ వరకు రాజకీయ సమీకరణాలను పరిష్కరించడంలో ఒవైసీ బిజీగా ఉన్నారు. ఇటీవల, అసదుద్దీన్ ఒవైసీ సీమాంచల్‌లో పర్యటించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో వీలైనన్ని ఎక్కువ పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని యోచిస్తున్నామని చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రాంతంలో ఒకే ఒక స్థానంలో పోటీ చేసామని, అది కిషన్‌గంజ్ స్థానం నుంచే మాత్రమే అన్నారు. అయితే ఈసారి కిషన్‌గంజ్‌లో కాకుండా మరో మూడు స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపాలని ప్లాన్ చేస్తున్నామని ఒవైసీ ప్రకటించారు.

**బీహార్‌లోని నాలుగు సీట్లపై ఒవైసీ దృష్టి**

2024 ఎన్నికల్లో బీహార్‌లోని నాలుగు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని ఒవైసీ యోచిస్తున్నారట. సీమాంచల్ ప్రాంతంలోని పూర్ణియా, అరారియా, కిషన్‌గంజ్, కతిహార్ లోక్‌సభ స్థానాలపై ఒవైసీ కన్నేశారు. ఇక్కడ తన అభ్యర్థులను నిలబెట్టాలని ప్లాన్ చేశారు. ఈ నాలుగు ముస్లిం ప్రాబల్యం ఉన్న స్థానాలు. ఇక్కడ 30 నుండి 60 శాతం ముస్లిం ఓటర్లు ఉన్నారు. 2019లో ఒవైసీ పార్టీ నుంచి అక్తరుల్ ఇమాన్ కిషన్‌గంజ్ నుంచి పోటీ చేసి రెండు లక్షల ఓట్లతో విజయం సాధించారు.

ఈ సీటులో కాంగ్రెస్ విజయం సాధించగా, జేడీయూ రెండు సీట్లు, బీజేపీ ఒక సీటు గెలుచుకున్నాయి. అప్పటి నుండి, సీమాంచల్ ప్రాంతంలో ఒవైసీ గ్రాఫ్ పెరిగింది. దాని కారణంగా అతను 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు స్థానాల్లో ఎమ్మెల్యేలు గెలుపొందారు. అయితే నలుగురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి ఆర్జేడీలో చేరారు. భారత్ జోడో న్యాయ యాత్ర పేరుతో ముస్లిం వర్గాల్లో తన ఉనికిని చాటుకునేందుకు రాహుల్ గాంధీ సీమాంచల్‌కు వచ్చి ఆ తర్వాత ఒవైసీ మూడు రోజుల పాటు క్యాంపు వేశారు.

**ఒవైసీ చూపు జార?ండ్, బెంగాల్ వైపు..**

బీహార్‌తో పాటు పశ్చిమ బెంగాల్, జార?ండ్ రాష్ట్రాల లోక్ సభ ఎన్నికల్లో కూడా పోటీ చేయాలని ఒవైసీ భావిస్తున్నారట. జార?ండ్‌కు చెందిన పార్టీ నేతల బృందాన్ని కూడా కలిశానని ఒవైసీ చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో గిరిజన రాష్ట్రంలోని రెండు మూడు స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టాలని పరిశీలిస్తున్నామన్నారు. ఇక్కడ గిరిజన, ముస్లిం ఓటర్లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారు. అదే విధంగా పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు ముస్లిం ప్రాబల్య స్థానాల్లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఒవైసీ వ్యూహరచన చేస్తున్నారట. కిషన్‌గంజ్‌లో జరిగిన ర్యాలీలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని సీమాంచల్‌కు ఆనుకుని 30 శాతానికి పైగా ముస్లిం ఓటర్లు ఉన్న స్థానాలపై ఒవైసీ కన్నేశారు.

**మహారాష్ట్రలో ఒకటి నుండి నాలుగు సీట్లలో ప్లాన్**


మహారాష్ట్రలోని 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఔరంగాబాద్ స్థానాన్ని గెలుచుకున్న ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ ముంబై లోక్‌సభ నియోజకవర్గంలోకి ప్రవేశించాలని ఆలోచిస్తోంది. మహారాష్ట్ర నుంచి తన ఏకైక ఎంపీని రాజధాని సీటు నుంచి పోటీకి దింపాలని ఒవైసీ ఆలోచిస్తున్నారట. మహారాష్ట్రలోని నాలుగు లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించాలని అసదుద్దీన్ ఒవైసీ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ముంబై నుంచి పోటీ చేయాలన్న ఎంపీ ఇంతియాజ్ జలీల్ ప్రతిపాదనను తమ పార్టీ పరిశీలిస్తుందని చెప్పారు. మహారాష్ట్రలోని నాలుగు లోక్‌సభ స్థానాలైన ధులే, నాందేడ్, భివాండి, ఛత్రపతి సంభాజీనగర్ స్థానాల్లో %ూ×వీ×వీ% తన అభ్యర్థులను నిలబెట్టాలని భావిస్తోంది. ఇందులో ఛత్రపతి సంభాజీనగర్ సీటు (గతంలో ఔరంగాబాద్) ప్రస్తుతం %ూ×వీ×వీ% చేతిలోనే ఉంది.

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో విలేకరులతో మాట్లాడిన ఒవైసీ.. సెక్యులర్‌గా చెప్పుకునే రాజకీయ పార్టీలు రాష్ట్రంలో అశాంతిలో ఉన్నాయని అన్నారు. దీంతో పాటు, ఇటీవల బీజేపీ దాని కూటమి భాగస్వాములలో చేరిన ప్రతిపక్ష శిబిరానికి చెందిన నాయకులను ఆయన ఘాటుగా విమర్శించారు. ఆరు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని ఇంతియాజ్ జలీల్ నుంచి పార్టీకి ప్రతిపాదన వచ్చిందని చెప్పారు. దీనిపై పార్టీ ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. అయితే, ముస్లిం ఓటర్లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్న నాలుగు లోక్‌సభ స్థానాలపై పార్టీ కన్నేసింది.

**యూపీలో 20 సీట్లకు ప్రతిపాదన**


%ూ×వీ×వీ% ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడు షౌకత్ అలీ 2024లో 20 లోక్‌సభ స్థానాలకు ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రతిపాదన పంపారు. అంబేద్కర్ నగర్, శ్రావస్తి, ఘోసీ, జౌన్‌పూర్, పశ్చిమ యూపీలోని సుల్తాన్‌పూర్, మొరాదాబాద్, సంభాల్, అమ్రోహా, సహారన్‌పూర్, మీరట్, పూర్వాంచల్ రీజియన్ స్థానాల్లో పోటీ చేయాలని ప్రతిపాదన పంపారు. ఫిబ్రవరి నెలాఖరులో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో షౌకత్ అలీ భేటీ అవుతారని, ఇందులో యూపీలో పోటీ చేసే సీట్ల సంఖ్య, ఆయన పర్యటన ఎప్పుడు మొదలవుతుందనే అంశంపై చర్చించనున్నారు. అయితే, యూపీకి చెందిన ఎఐఎంఐఎం కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రతిపాదన పంపిన లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల కోసం అన్వేషణ ప్రారంభించింది. ఇది కాకుండా మార్చిలో యూపీలో నాలుగు బహిరంగ సభ్యలు నిర్వహించాలని ఒవైసీ యోచిస్తున్నారు.

## కాలుష్య కాసారంగా.. పెద్దవాగు



**కాగజ్‌నగర్ టౌన్ :** సిర్పూరు పేపరు మిల్లు (ఎస్పీఎం) కాలుష్యంతో ప్రమాదం ఏర్పడుతోంది. ఫ్యాక్టరీ నుంచి వెలువడే విషరసాయన జలాలు నురగలు కక్కు తూ పెద్దవాగులో కలిసి నీటిని కలుషితం చేస్తున్నాయి. కాగితపు తయారీలో కీలకమైన గుజ్జు శుద్ధి చేసే క్రమంలో 200రకాలకుపైగా రసాయానాలను వాడుతారు. పల్ప్ (గుజ్జు) శుద్ధి చేసిన తర్వాత విడుదలయ్యే వ్యర్థ జలాల్లో ఇంకా రసాయన అవశేషాలు మిగిలి ఉండటం వల్ల నీరంతా కాలుష్య కాసారంగా మారుతోంది. నురగులు కక్కుతు ప్రవహించే నీటిని కాగజ్‌నగర్ పరిసరాల్లో చాలా మంది రైతులు వరిసాగుకు వినియోగిస్తున్నారు. ఈ విధంగా పండించిన ఆహార ఉత్పత్తులను వినియోగించిన వారికి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫిర్యాదులు అందితే తప్పా అధికారులు వచ్చే పరిస్థితి లేదని ఆయా మండలాల ప్రజలు పేర్కొంటున్నారు. ఎస్పీఎం పరివాహక ప్రాంతాల్లోని కాలనీలు, గ్రామాల్లో ఈ వ్యర్థ జలాలతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో ప్రజలు ఈ వాసన భరించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా కూడా పట్టించుకోవటం లేదంటున్నారు. పైగా పల్ప్ శుద్ధి తర్వాత విడుదలైన వ్యర్థ జలాలలో ఎలాంటి హానికారక రసాయాలు లేవని ఫ్యాక్టరీ ప్రతినిధులు పేర్కొంటున్నారు కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట, బెజ్జూరు మండలాల గుండా ఈ వ్యర్థ జలాల ప్రవాహం వెళుతుంది.

## నస్పూర్ మున్సిపాలిటీలో కమిషనర్ ఇష్టారాజ్యం




**మంచిర్యాల :** ఆయన నస్పూర్ మున్సిపల్ కమిషనర్. ఆనారోగ్య కారణం గా ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు మెడికల్ లీవు పెట్టారు. అనంతరం రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా 14వ తేదీన రిలీవ్ అయి 15న చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉండగా ఆయన 14వ తేదీన తొమ్మిది ఇళ్లకు నిర్మాణ అనుమతులు జారీ చేశారు. ఆ రోజున మెడికల్ లీవులో ఉండి, హడావుడిగా విధుల్లో చేరడమేగాక, అదే రోజు రిలీవ్ కూడా అయ్యారు. అయినా ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేయడం విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు బదిలీ అయినప్పుడు పెండింగు పనులు హడావుడిగా పూర్తి చేయడం అక్కడక్కడ జరుగుతూనే ఉంటుంది. అయితే విధుల్లో నుంచి రిలీవ్ అయిన అధికారి నిర్మాణ అనుమతులు జారీ చేయడం సంచలనంగా మారింది. అదికూడా ఓ అసైన్డ్ భూమిలో కొనుగోలు చేసిన ప్లాటుకు సదరు కమిషనర్ ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయడం గమనార్హం. నస్పూర్ మున్సిపాలిటీ పరిధి లోని సర్వే నెంబరు 42లో అసైన్డ్ భూమి ఉంది. అందులో అక్రమంగా కొందరు ప్లాట్లు విక్రయిం చారు.

# తెలుగుకు పునర్వైభవం తేవాలి..!

జంతువుల నుండి మానవుని వేరు చేసేది భాష ఒక్కటే. భాష లేకపోతే మన భావాలను ఇతరులతో వ్యక్తీకరించడం సాధ్యం కాదు. సమాజం ద్వారా వ్యక్తి లోనికి ప్రవేశించి వ్యక్తిని సామాజికుడిని చేసేది మాతృభాష. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతోంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది.. ఇదంతా గత కాలం గురించి పూర్తిగా తెలిసిన తెలుగు వారికి, తెలియనిది ఏమీ కాదు. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. వెనుజులకు చెందిన వర్తకుడు నికొలో డా కాంటి భారతదేశం గుండా ప్రయాణిస్తూ, తెలుగు భాషలోని పదాలు ఇటాలియన్ భాష వలె అజంతాలు (అచ్చు చివరన కలిగి) గా ఉండటం గమనించి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా 1402 లోనే ప్రశంసించారు. పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి - విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టి పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికీ అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు...మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు ... ప్రఖ్యాత ఆంగ్ల కవి విలియం షేక్స్పియర్ ఏమి చదవుకుని, ఆంగ్ల సాహిత్య శిఖరంలా ఎదిగారనేది అర్థం చేసుకోవాలి. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు 9.3 కోట్ల మందికి మాతృభాషగా ఉంది. భారతావనిలో హిందీ 366 మిలియన్ల, బెంగాలీ 83 మిలియన్ల, తెలుగు 74 మిలియన్ల, తర్వాత మరాఠీ 72, తమిళం 61, కన్నడం 55, ఉర్దూ 52, గుజరాతీ 46, మలయాళం 33, ఒరియా 33 మిలియన్ల మంది మాట్లాడుతూ 10 స్థానాలలో ఉన్నారు. తెలుగు భాషను 2008 అక్టోబరు 31న భారత ప్రభుత్వం ప్రాచీన భాషగా గుర్తించింది. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణా, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. తెలుగు భాషాభిమానులు ప్రపంచ వ్యాప్తంగా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేశారు. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు.. తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు " తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్లు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాలి. మారిషస్ లో తెలుగు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయ స్థాయి కోర్సుల నిర్వహణబీ ఆస్ట్రేలియా ప్రభుత్వం అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలుగుతున్నది. అమెరికాలో తెలుగు వారి కోసం బ్యాలెట్లపై ఇటీవలే తెలుగులో ముద్రించడం వంటి అంశాలను గమనించాలి.

# మేం అధికారంలోకి వస్తే భారత్‌తో మైత్రి మరింత బలోపేతం



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తమ పార్టీ గెలిస్తే నాటోతో పాటు భారత్, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలతో అమెరికా మైత్రిని మరింత బలోపేతం చేస్తామని భారతీయ అమెరికన్, రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న నిక్కీ హేలీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ట్రంప్ మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికైతే నాటో కూటమికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నాటో కూటమికి రష్యా, చైనా వంటి దేశాలు భయపడుతున్నాయని, దాన్ని బలంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. కూటమితో పాటు మరికొన్ని దేశాలతో బంధం మరింత దృఢంగా ఉండేలా చూసుకోవాలని అప్పుడే శత్రుదేశాలు హద్దుల్లో ఉంటాయని అభిప్రాయపడ్డారు. నాటోపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ "మాజీ అధ్యక్షుడు ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అధికారమిచ్చారు. తన రాజకీయ ప్రత్యర్థులను చంపే ఓ దుండగుడి వైపు ఆయన ఉన్నారు" అని పేర్కొన్నారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు బైడెన్ అనేక రంగాల్లో విఫలమయ్యారని నిక్కీ హేలీ విమర్శించారు. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న దాడుల గురించి మాట్లాడుతూ.. "పుతిన్ ఉక్రెయిన్‌ను చుట్టేసినట్లే పోలండ్, బాల్టిక్ దేశాలనూ ఆక్రమించాలని చూస్తున్నారు. ఇలాంటి సందర్భంలో అమెరికా కచ్చితంగా యుద్ధ రంగంలో ఉంటుంది. ఎందుకంటే అవి నాటో దేశాలు. వాటికి మా సహాయం చాలా ముఖ్యం" అని నిక్కీ స్పష్టంచేశారు.

# మార్చి 9 తర్వాతే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్..




న్యూఢిల్లీ: 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 9 తర్వాత ప్రక టించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు మంగళవారం తెలిపాయి. 18వ లోక్‌సభ సభ్యులను ఎన్నుకునే సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్ మరియు మే నెలల్లో జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.
ఇప్పటికే ఎన్నికల తేదీలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) కసరత్తు పూర్తయినట్లు తెలుస్తోంది. లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి గత కొన్ని రోజులుగా ఇసిఐకి చెందిన అధికారుల బృందం వరుసగా పలు రాష్ట్రాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. వివిధ రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను సిద్ధం చేసినట్లు ఆ వర్గాలు తెలిపాయి. దీంతో మార్చి 8-9 తేదీల్లో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది.గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా, జమ్మూకాశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు, బలగాలపై అందులో చర్చించనున్నారు. ఆ తర్వాత మార్చి 12-13 తేదీల్లో ఇసి బఅందం జమ్మూకాశ్మీర్‌లో పర్యటించనున్నారు. బలగాల లభ్యత ఆధారంగా ఎన్నికలపై నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. లోక్‌సభతో పాటే స్థానిక అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలపై ఒక అంచనాకు రానున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మార్చి రెండోవారంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.


# కర్ణాటక సిఎంపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ వద్దు

న్యూఢిల్లీ: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై క్రిమినల్ కార్యకలాపాలు చేపట్టకుండా సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది.
పాలక పక్షానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన సాగించడమనేది ప్రతి పౌరుని ప్రాథమిక హక్కని ఆయన వాదించిన నేపథ్యంలో సుప్రీం నిర్ణయం వెలువడింది. 2022లో నిరసన ప్రదర్శన సందర్భంగా అప్పటి బిజెపి ప్రభుత్వాన్ని భయపెట్టేందుకు, నేరపూరితంగా బలాన్ని ఉపయోగించే లక్ష్యంతోనే చట్టవిరుద్ధంగా గుమిగూడారంటూ సిద్ధరామయ్య, మరో 35 మందిపై చార్జిషీట్ దాఖలైంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రి ఈశ్వరప్ప రాజీనామా చేయాలని కోరుతూ అప్పట్లో ప్రదర్శన నిర్వహించారు. భావ ప్రకటనా స్వేచ్ఛ కలిగిన ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలియజేయడమనేది ప్రాథమిక హక్కు. అని, ఎలాంటి నేరపూరితమైన ఉద్దేశం లేకుండా శాంతియుతంగా ఆందోళన నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేరని సిద్ధరామయ్య తరపున సీనియర్



న్యాయవాదులు కపిల్ సిబల్, ఎ.ఎం.సింఘ్వి వాదించారు. కేవలం వాహనాల రాకపోకలను అడ్డగించారన్న ఆరోపణలతో ఆందోళనకారులపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ చేపట్టలేరని సిబల్ పేర్కొన్నారు. శాంతి భద్రతల ఉల్లంఘన పేరుతో ప్రాథమిక హక్కుల ప్రక్రియపై శిక్షార్హమైన చర్యలు తీసుకుంటున్నారని వాదించారు.క్రిమినల్ కేసును కొట్టివేయడానికి కర్ణాటక హైకోర్టు ఈ నెల 2న తిరస్కరించడంతో నేతలు సుప్రీంను ఆశ్రయించారు.

# సొంత దేశంపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు..!



**వాషింగ్టన్ :** ఇటీవల రష్యాలో వివాదాస్పదమైన అక్కడి ప్రతిపక్షనేత అలెక్సీ నావల్ని మృతిపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం స్పందించారు.ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఈ విషయమై తాజాగా ఆయన ఒక పోస్టు పెట్టారు. నావల్ని మృతిని అమెరికాలో తాను చేస్తున్న న్యాయపోరాటాలతో ట్రంప్ పోల్చారు. నావల్ని మృతి అమెరికాలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై తనను మరింత అప్రమత్తం చేసిందన్నారు.ఇదిలాఉంటే ఇదే పోస్టులో ట్రంప్ అమెరికా ప్రస్తుత స్థితిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఒక విఫలమవుతున్న దేశంగా ట్రంప్ అభివర్ణించారు. 'రాడికల్ లెఫ్ట్ రాజకీయ నాయకులు, జడ్జ్‌లు, ప్రాసిక్యూటర్లు, అంతా కలిసి దేశాన్ని వినాశనం వైపు నడిపిస్తున్నారు. అక్రమ వలసదారులకు తెరచుకున్న సరిహద్దులు, ఎన్నికల్లో రిగ్గింగ్, కోర్టుల అసందబద్ధ నిర్ణయాలు అన్నీ కలిసి అమెరికాను నాశనం చేస్తున్నాయి. దేశాన్ని పతనం దిశగా నడిపిస్తున్నాయి'అని ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా, ఫిబ్రవరి 16న రష్యాలోని ఆర్కిటిక్ పీనల్ కాలనీ జైలులో ఆ దేశ ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్ని అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మరణం వెనుక రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉండొచ్చన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. నావల్ని మృతిపై రష్యాలో అతడి అభిమానులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పలు చోట్ల నిరసరన తెలుపుతున్న నావల్ని అభిమానులను అక్కడి ప్రభుత్వం ఎక్కడికక్కడ అడ్డుకొని అరెస్టులు చేస్తోంది. ఇదిలాఉంటే ఇదే పోస్టులో ట్రంప్ అమెరికా ప్రస్తుత స్థితిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఒక విఫలమవుతున్న దేశంగా ట్రంప్ అభివర్ణించారు.

# ప్రముఖ రేడియో బ్రాడ్‌కాస్టర్ అమీన్ సయానీ కన్నుమూత


ముంబయి : ప్రముఖ రేడియో ప్రసారకర్త, 'బినాకా గీత్‌మాల'కు ప్రతీకగా నిలచిన అమీన్ సయానీ 91వ ఏట కన్నుమూసినట్లు ఆయన కుమారుడు రాజీల్ సయానీ బుధవారం వెల్లడించారు. అమీన్ సయానీ మంగళవారం రాత్రి గుండె పోటుకు గురయ్యారు. ఆయనను దక్షిణ ముంబయిలోని ఒక ఆసుపత్రికి తీసుకువెళ్లారు కానీ ఆయనను కాపాడ లేక పోయారు. 'ఆయన హెచ్‌ఎన్ రిలయన్స్ ఆసుపత్రిలో మరణించారు. ఛాతీలో నొప్పిగా ఉన్నట్లు ఆయన చెప్పిన తరువాత మంగళవారం రాత్రి 6 గంటలకు ఆసుపత్రికి వెంటనే తరలించాం. ఆయన ప్రాణ రక్షణకు వారు ప్రయత్నించారు. కాని రాత్రి సుమారు 7 గంటలకు ఆయన కన్ను మూశారు' అని రాజీల్ సయానీ తెలియజేశారు. అంత్యక్రియలు గురువారం జరుగుతాయని, కుటుంబం త్వరలోనే ఒక ప్రకటన విడుదల చేస్తుందని రాజీల్ తెలిపారు. రేడియో సిలోన్‌లో 'నమస్తే బెహనో ఔర్ భాయియోం, మై ఆప్‌కా దోస్త్ అమీన్ సయానీ బోల్ రహా హూం' అన్న సయానీ స్వీయ పరిచయం శ్రోతలకు ఇప్పటికీ బాగా గుర్తు ఉంటుంది.ఆయన 1932 డిసెంబర్ 21న ముంబయిలో బహు భాషా కుటుంబంలో జన్మించారు. ఆయనకు బాల్యం నుంచే సృజనాత్మక రచన శక్తి ఉన్నది. కేవలం 13 ఏళ్ల వయస్సులో ఆయన తన తల్లి పక్షపత్రిక 'రెహ్‌బార్' కోసం రాయడం ప్రారంభించారు. అదే వయస్సులో ఆయన ఇంగ్లీష్‌లో ధారాళంగా మాట్లాడసాగారు. ఆకాశవాణి బొంబాయి కేంద్రం ఇంగ్లీష్ విభాగంలో పిల్లల కార్యక్రమాల్లో పాల్గొనసారంభించారు. అఇతే, హిందుస్థానీలో కార్యక్రమం సమర్పణకు ఆడిషన్‌లో సయానీని తిరస్కరించారు. ఆయన వాణిలో గుజరాతీ యాస స్వల్పంగా వినిపించేది. అప్పటి కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి బివి కేస్కర్ ఎఐఆర్‌లో హిందీ పాటలను నిషేధించినప్పుడు రేడియో సిలోన్ ప్రజాదరణ పొందసాగింది.

# మళ్లీ ఇమ్రాన్ ఖాన్ పీఎం అయ్యే ఛాన్స్....!



**ఇస్లామాబాద్ :** తీవ్ర గందరగోళం.. రిగ్గింగ్ ఆరోపణల నడుమ ఎన్నికలు పూర్తి చేసుకున్న పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీకి కాబోయే ప్రధాని ఎవరనే ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే అస్పష్టతతో కూడిన ఫలితాలతో.. అనిశ్చితి నెలకొన్న పాకిస్థాన్‌లో రాజకీయం ఇప్పుడు ఆసక్తికరమైన మలుపు తిరిగింది. ఇప్పటికే నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పీఎంఎల్-ఎన్ ప్రభుత్వ ఏర్పాటునకు తీవ్రంగా యత్నిస్తుండగా.. ప్రతిపక్ష పాత్రకైనా రెడీ అని ప్రకటించిన ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటు యత్నాల్లోకి దిగడం విశేషం. మెజారిటీ రాకున్నా.. మిత్రపక్షం పాకిస్థాన్ పీపుల్స్ పార్టీతో.. మరికొన్ని చిన్నచిన్న పార్టీలతో ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చింది ముస్లిం లీగ్ నవాజ్‌యత్నిస్తోంది. తన సోదరుడిని షెహబాజ్‌ను ఎలాగైనా మరోసారి ప్రధానిని చేయాలని నవాజ్ షరీఫ్ తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈలోపు ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు భలే ట్విస్ట్ ఇచ్చారు. ప్రస్తుతం జైల్లో ఉన్న ఇమ్రాన్ ఖాన్‌కు మద్దతుగా ఆయన మద్దతుదారులు.. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి మెజారిటీ స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఇండిపెండెంట్లు కావడంతో వాళ్లకు ప్రభుత్వ ఏర్పాటునకు వీలు లేకుండా పోయింది. దీంతో.. ప్రతిపక్ష పాత్రకే వీళ్లంతా పరిమితం కావొచ్చనే చర్చ నడిచింది. ఈ లోపు.. పీటీఐ వర్గం ఓ ఆసక్తికరమైన ప్రకటన చేసింది. పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీలో మొత్తం 336 సీట్లున్నాయి. వీటిలో 266 స్థానాలకు ఎన్నికలు జరిగాల్సి ఉంది. ఓ సీటులో అభ్యర్థి చనిపోవడంతో ఈసారి 265 సీట్లకే ఎన్నికలు జరిగాయి. మిగతా 70 స్థానాల్లో 10 మైనారిటీలకు, 60 మహిళలకు రిజర్వ్ చేస్తారు. వీటిని ఆయా పార్టీలకు అవి గెలిచిన స్థానాలను బట్టి దామాషా ప్రకారం కేటాయిస్తారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కనీసం 135 సీట్లలో గెలుపొందాల్సి ఉంది. అయితే.. ఇమ్రాన్ ఖాన్ పీటీఐ పార్టీని పాక్ ఎన్నికల సంఘం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించింది. దీంతోనే వాళ్లు ఇండిపెండెంట్లుగా పోటీ చేసి నెగ్గారు.

# కంటి చూపు పెరగాలంటే ఇలా చేయండి....!



ప్రస్తుతం ఉన్న రోజుల్లో చాలామంది ప్రజలు చిన్న వయసులోనే కళ్లద్దాలను పెట్టుకొనే పరిస్థితి ఏర్పడుతోంది. ఇందుకు గల కారణం జీవనశైలిలోని మార్పులతో పాటు ఆహార అలవాట్లు కూడా ప్రధాన కారణమని చెప్పవచ్చు.శరీరానికి తగ్గట్టుగా విటమిన్స్ సైతం అందకపోవడం వల్లే కంటి చూపు చాలామందికి మందగిస్తోందట. అయితే పలు రకాలు చిట్కాలను పాటించడం వల్ల కంటి చూపుని సైతం పెంచుకోవచ్చు. అయితే నెల రోజులలో ఇలా చేస్తే కచ్చితంగా అద్దాలు ఉపయోగించాల్సిన పని ఉండదు. అంత ఎఫెక్టివ్ గా ఈ చిట్కాలు సైతం పనిచేస్తాయట. కంటి చూపు మెరుగుపరచడానికి కరివేపాకు ఒక దివ్య ఔషధంలా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే బీటా కెరటి అనే పదార్థం పుష్కలంగా లభిస్తుంది. ఇది కంటి చూపు మెరుగుపరచడంలో కూడా కీలకమైన పాత్ర వ్యవహరిస్తుంది. మన పూర్వపు పెద్దలు కూడా ఇంట్లో కరేపాకు చెట్టును తప్పకుండా పెంచుకునేవారు ఇది ఆహారంలో ఒక భాగంగా చేర్చుకొని తింటూ ఉండేవారు. కరేపాకు తో పాటు కొత్తిమీర, మునగాకు, పాలకూరలలో ఎక్కువగా బీటా కెరటిన్ వంటి పదార్థం ఉంటుంది.. ఇలాంటి ఆకుకూరలను సైతం వారంలో ఒక్కసారైనా తినడం వల్ల మరిన్ని లాభాలు ఉన్నాయి. చేపలు కూడా తరచూ తినడం వల్ల ఒమేగా త్రీ వంటివి లభిస్తాయి ఇవి కంటి చూపు పెరుగుదలకు చాలా ఉపయోగపడతాయి. పడుకునే ముందు ఐదు బాదం గింజలను నానబెట్టి ఉదయాన్నే వాటిని మెత్తగా నూరి మురియాల పొడి పటిక బెల్లం పొడిని వేసుకొని నెయ్యిలో కలిపి ప్రతి రోజు క్రమం తప్పకుండా రెండు నెలల పాటు తింటే అద్దాలు పెట్టుకోవలసిన అవసరమే ఉండదట. అంతేకాకుండా ఉసిరి వంటివి తినడంతో పాటు విటమిన్ ఏ ఉండేటువంటి మాంసాలను తినడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. అప్పుడప్పుడు రెండు అరిచేతులను వృద్ధి కంటి రెప్పల మీద పెట్టుకోవడం వల్ల కంటికి అలసట కూడా తగ్గుతుందట. ఉదయం లేవగానే సూర్యరశ్మి తగిలేలా కంటిని చూసుకోవాలి. తరచూ నీరు ఎక్కువగా తాగడం వల్ల కూడా ఎక్కువ లాభాలు ఉన్నాయి.

# కామెర్లకు చింతచిగురు బెస్ట్......!



చింత చిగురు ను పప్పుగా, చింత చిగురు పొడిగా, చట్నీగా ఇలా ఎన్నో వాటిని వంటల్లో మనం తయారు చేసుకోవడానికి చింతాకును ఉపయోగిస్తూ ఉంటాము. అయితే చింతచిగురు వలన మన ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా కామెర్ల వ్యాధిని కూడా నయం చేసే గుణం ఇందులో కలిగి ఉంటుందట. చింతచిగురు రసాన్ని సైతం తీసి పటిక బెల్లం లో కలుపుకొని తాగితే కామెర్ల వ్యాధి కూడా అదుపులోకి వస్తుందట. చింత చిగురుని తీసుకోవడం వలన వార్త వల్ల వచ్చే ఎటువంటి సమస్యలు కూడా దరి చేరవు. అలాగే కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. చింతచిగురుని తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఎముకలను దృఢంగా అయ్యేలా చేస్తాయి. ఎవరైనా గొంతు నొప్పి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు కాస్త చింత చిగురుని తినడం వల్ల ఉపశమనాన్ని పొందవచ్చు. చింతచిగురు నీటిని వేడి నీళ్లలో మరిగించి ఆ నీటితో నోరుని పుక్కలించడం వల్ల గొంతులో ఎలాంటి ఇన్ఫెక్షన్ ఉన్న మటుమాయం అవుతుంది. చింతచిగురుని అప్పుడప్పుడు తినడం వల్ల కడుపులో ఉండే నులిపురుగులు కూడా నశిస్తాయి. థైరాయిడ్ తో ఇబ్బంది పడేవారు చింతచిగురుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా తినవచ్చు. ఇది థైరాయిడ్ని కూడా అదుపులో ఉండేలా ఇందులో పోషకాలు ఉంటాయి. రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా చింతచిగురు చాలా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ మన శరీరానికి చాలా ఉపయోగపడేలా చేస్తుంది.

## ఇంగువతో అనారోగ్య సమస్యలకు చెక్



ఇంగువ ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తుంది.ఇంగువను ఉపయోగించడం వల్ల మనం చాలా రకాల అనారోగ్య సమస్యలను ఈజీగా దూరం చేసుకోవచ్చు. ఇంగువను వాడడం వల్ల మనకు కలిగే ప్రయోజనాలు గురించి ఇప్పుడు పూర్తిగా తెలుసుకుందాం. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంగువ మనకు సహాయపడుతుంది. తామర, గజ్జి, మొటిమలు వంటి చర్మ సమస్యలను తగ్గించడంలో ఇంగువను వాడడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అదే విధంగా ఇంగువను తీసుకోవడం వల్ల లైంగిక సామర్థ్యం కూడా మెరుగుపడుతుంది. ఇంగువ అనాల్జేసిక్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. దీనిని తరుచూ తీసుకోవడం వల్ల స్త్రీలల్లో నెలసరి సమయంలో వచ్చే నొప్పి తగ్గుతుంది. ఇక ఇంగువ యాంటీ మైక్రోబయాల్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బ్యాక్టీరియా, వైరస్ ల వల్ల కలిగే ఇన్ఫెక్షన్ ల బారిన పడకుండా ఉంటాము.ఇంగువను తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. రక్తపోటు స్థాయిలు అదుపులో ఉంటాయి. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇంగువను తీసుకోవడం వల్ల శ్లేష్మం, దగ్గు, కఫం వంటి సమస్యలు తగ్గుతాయి. శ్వాస సంబంధిత సమస్యలు దరి చేరకుండా ఉంటాయి.ఇంగువ యాంటీ ఇన్ ప్లామేటరీ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. శరీరంలో మంట, ఉబ్బసం, ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడే వారు దీనిని తీసుకోవడం వల్ల చక్కటి ఉపశమనం కలుగుతుంది. జీర్ణశక్తిని మెరుగుపరచడంలో ఇంగువ మనకు ఎంతో సహాయపడుతుంది. దీనిని తీసుకోవడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు తగ్గుతాయి.పొట్టలో అసౌకర్యం తగ్గుతుంది. పొట్ట ఆరోగ్యం మెరుగుపడుతుంది.ఈ విధంగా ఇంగువ మన ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తుంది.

## ఉన్నఫలంగా సిగరెట్ మానేస్తే......!




మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం. ఈ విషయం అందరికీ తెలుసు. ఇక టీవీలు, సినిమా థియేటర్లలో ఎప్పుడు ఈ విషయాన్ని చూపిస్తూ ఉంటారు. అంతెందుకు ఇక లిక్కర్ సిగరెట్ ప్యాకెట్లపై కూడా ఈ విషయం పెద్ద పెద్ద అక్షరాలతో రాసి ఉంటుంది. అయితేనేమ్ ఈ విషయాన్ని ఎవరు పట్టించుకోరు. ఇక మద్యపానం ధూమపానం చేయడానికి మమ్మల్ని ఎవర్రా ఆపేది అన్నట్లుగా వ్యవహరిస్తూ ఉంటారు. ఒకప్పుడు 50 ఏళ్ల పైబడిన వారు మాత్రమే ఇలా సిగరెట్ సరదా కోసం తాగే అలవాటును చేసుకునే వారు. కానీ ఇప్పుడు స్కూల్ పిల్లల దగ్గర నుంచి కాలేజీ స్టూడెంట్స్ వరకు అందరూ కూడా సిగరెట్ తాగడం చేస్తూ ఉన్నారు. ఇక ఉద్యోగాలు చేసేవారు అయితే సిగరెట్ తాగితే ఏదో తెలియని రిలీఫ్ వస్తుంది అని కారణం చెబుతూ ధూమపానానికి బానిసలుగా మారిపోతూ ఉండడం కూడా నేటి రోజుల్లో చూస్తూ ఉన్నాం. అయితే ఇలా సిగరెట్ రోజు తాగడం ఆరోగ్యం పై ప్రభావం చూపుతుంది. దీనిని అర్థం చేసుకున్న కొంతమంది ఇక ఉన్నఫలంగా సిగరెట్ అలవాటును మానుకోవడం చేస్తూ ఉంటారు. అయితే ఇలా ఒక్కసారిగా సిగరెట్ తాగడం మానేస్తే ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపిస్తుందట. ఇలా హఠాత్తుగా సిగరెట్ మానేసే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సంవత్సరాల నుంచి సిగరెట్ తాగుతూ ఉండటం వల్ల శరీరంలోని నికోటిన్ ప్రభావం కాస్త ఎక్కువగా ఉంటుంది. దీంతో హఠాత్తుగా సిగరెట్ మానేస్తే ఇక అదే మిమ్మల్ని సిగరెట్ కోసం పరితపించేలా చేస్తుంది. దానివల్ల కొంత చిరాకు, మానసిక కొల్లోలం లాంటి సమస్యలు వస్తాయట. ఇక ఆందోళనకు కూడా దారితీస్తుందట. అంతేకాదు అకస్మాత్తుగా సిగరెట్ మానేస్తే కొంతమందిలో ఇక ఏకాగ్రత అనేది కూడా దెబ్బతింటుందట. అయితే ధూమపానం ఆకలిని అణచివేస్తుంది. కాబట్టి సిగరెట్ మానేయగానే ఇక చాలా మందిలో ఆకలి ఎక్కువ ఉండే అవకాశం ఉంది. దీనివల్ల కొందరిలో కొలెస్ట్రాల్ అధికమై బరువు పెరిగే అవకాశం కూడా ఉందట. ఇక కొన్ని రోజుల వరకు నిద్ర విధానాలకు భంగం కలిగే అవకాశం కూడా ఉంటుందట. అందుకే హఠాత్తుగా కాకుండా కొంచెం కొంచెంగా ఈ అలవాటు నుంచి బయట పడటం మంచిది అని సూచిస్తున్నారు నిపుణులు. ఇక ఉద్యోగాలు చేసేవారు అయితే సిగరెట్ తాగితే ఏదో తెలియని రిలీఫ్ వస్తుంది అని కారణం చెబుతూ ధూమపానానికి బానిసలుగా మారిపోతూ ఉండడం కూడా నేటి రోజుల్లో చూస్తూ ఉన్నాం. అయితే ఇలా సిగరెట్ రోజు తాగడం ఆరోగ్యం పై ప్రభావం చూపుతుంది.

# రైస్ వాటర్ చేసే మేలు తెలిస్తే.....




ఆసియా ఖండంలో ఎక్కువగా రైస్ ని తింటూ ఉంటారు.అయితే అన్నం వండటానికి ముందు రైస్‌ను రెండు, మూడు సార్లు కడుగుతారు. ఆ నీళ్ళని ఎక్కువగా పారబోస్తారు.అయితే రైస్ వాటర్ లో ఉన్న మినరల్స్, విటమిన్స్, అమినో ఆసిడ్స్, ప్రొటీన్లు, విటమిన్లు, కాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.రైస్ ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అసలు ఆ వాటర్ ని ఇకపై పారబోయరు.బియ్యం కడిగిన నీటిని తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. ఈ నీటిని తాగడం వల్ల వాంతులు లేదా జ్వరం వంటి ఏవైనా ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. బియ్యం కడిగిన నీళ్లలో నారింజ తొక్క, నిమ్మతొక్క కలిపి తాగడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎండాకాలంలో ముఖం నల్లబడితే అలోవెరా జెల్, రోజ్ వాటర్ కలిపి బియ్యం కడిగిన నీళ్లలో బాగా కలిపి ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా పెరుగుతుంది. రైస్ వాటర్‌లో ఉప్పు, నెయ్యి, ఎండుమిర్చి కలిపి తింటే జీర్ణశక్తి మెరుగవుతుంది. వేసవి కాలంలో రైస్ వాటర్ తాగడం వల్ల శరీరం హైడ్రేట్ గా ఉండటమే కాకుండా మంచి హోం రెమెడీ కూడా.స్త్రీలు తెల్ల రుతుక్రమం సమస్యతో బాధపడుతుంటే ఈ రైస్ వాటర్ ను రెగ్యులర్ గా తాగితే ఈ సమస్య నుంచి బయటపడతారు. బియ్యం కడిగిన నీరు తాగడం వల్ల మంట, విరేచనాలు తగ్గుతాయి. వేసవి కాలంలో చెమట పొక్కుల సమస్యకు బియ్యం కడిగిన నీటితో స్నానం చేయడం ప్రభావవంతంగా ఉంటుంది.ముఖం ఎర్రబారడం, చర్మానికి అలర్జీలు వంటి సమస్యలు ఉంటే బియ్యం నీటితో ముఖం కడుక్కోవడంతో ఫలితాలు ఉంటాయి. బియ్యం కడిగిన నీటిని జుట్టుకు పట్టిస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. రైస్ వాటర్‌లో లావెండర్ ఆయిల్, ఆలివ్ ఆయిల్ మిక్స్ చేసి మీ జుట్టును కడగడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.బియ్యం కడిగిన నీటిని కాటన్ లేదా శుభ్రమైన గుడ్డతో ముఖంపై అప్లై చేయడం వల్ల ముఖం మెరుస్తుంది.

## రక్తహీనతని తగ్గించే పండ్లు...?



ఈ పండ్లను తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య తగ్గడంతో పాటు లేని వారికి కూడా రాకుండా ఉంటుందని అంతేకాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.జామకాయల్లో ఐరన్ , విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది.100 గ్రాముల జామకాయలల్లో 228.3 మిల్లీ గ్రాముల విటమిన్ సి, 0.3 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. ఈ పండ్లను తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుంది.ఇక విటమిన్ సి, ఐరన్ ఎక్కువగా ఉండే పండ్లల్లో ఆపిల్స్ కూడా ఒకటి.100 గ్రాముల ఆపిల్ పండ్లల్లో 0.1 మిల్లీ గ్రాముల ఐరన్, 840 మిల్లీగ్రాముల విటమిన్ సి ఉంటుంది. ఈ పండ్లను తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. విటమిన్ సి ఎక్కువగా ఉండే వాటిల్లో కివి పండ్లు కూడా ఒకటి. 100 గ్రాముల కివి పండ్లల్లో 92.7 మిల్లీ గ్రాముల విటమిన్ సి ఉంటుంది. ఈ పండ్లను తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ పెరుగుతుంది.ఇక ఐరన్, విటమిన్ బి6 వంటి పోషకాలు కలిగిన అరటిపండ్లను తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. ఇవి హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో మనకు సహాయపడతాయి.

# ఉల్లిపాయ ప్రయోజనాలు....



ఉల్లిపాయ ప్రయోజనం తెలిస్తే అస్సలు వదలరు?ఉల్లిపాయ ప్రయోజనం తెలిస్తే అస్సలు వదలరు.ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంత మేలు జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఉల్లిపాయ రక్తపోటు అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. పొట్ట ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి ఇన్ఫెక్షన్ ల బారిన పడకుండా కాపాడడంలో కూడా ఇవి మనకు సహాయపడతాయి. వీటిలో యాంటీ ఇన్ ప్లామేటరీ లక్షణాలు కూడా ఉంటాయి. అలర్జీ, ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడే వారు ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల చక్కటి ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది. వీటిని తీసుకోవడం వల్ల పలు రకాల క్యాన్సర్ ల బారిన పడకుండా ఉంటాము. ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటాము. ఉల్లిపాయలల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్, పాలీఫినాల్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి కణాల ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి అనారోగ్య సమస్యల బారిన పడకుండా కాపాడడంలో సహాయపడతాయి. ఉల్లిపాయలల్లో సల్ఫర్, క్వెర్సెటిన్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.ఉల్లిపాయలల్లో క్యాలరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల చాలా సమయం వరకు ఆకలి వేయకుండా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల మనం సులభంగా బరువు తగ్గవచ్చు.

# ఆమె అలసిపోయేదే కాదు. రష్మికపై మృణాల్ కామెంట్స్!



%సొంత ఇండస్ట్రీలో కొన్నేళ్ల క్రితం ఎంటర్ అయ్యి%ా% అక్కడ సరైన రిసెప్షన్ లేకపోయినా టాలీవుడ్‌కి వచ్చిన తర్వాత స్టార్ స్టేటస్ పొందిన హీరోయిన్లు చాలామందే ఉన్నారు.

ఇన్నేళ్ల కెరీర్‌లో ఎప్పుడూ చూడని స్టార్ బజ్ పొందుతుంటారు ఆ నాయికలు. అలాంటి వారిలో మృణాల్ ఠాకూర్ ఒకరు. ఎప్పుడో పదేళ్ల క్రితం మరాఠీ ఇండస్ట్రీలో కెరీర్ ప్రారంభించిన ఆమె ఇప్పుడు అంటే తెలుగులో తొలి సినిమా సుమారు 10 ఏళ్ల తర్వాత మన దగ్గర స్టార్ హీరోయిన్ అయ్యింది. ఈ క్రమంలో ఆమె



గురించి మాట్లాడింది.

'సీతారామం' సినిమా పేరు వినగానే సినీప్రియుల మదిలో మెదిలే అందమైన రూపాలు రెండు. ఒకటి సీతగా చెరగని ముద్ర వేసిన మృణాల్ ఠాకూర్ కాగా, రెండోది అఫ్రీన్‌గా ఆకట్టుకున్న రష్మిక మందన. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అఫ్రీన్ గురించి సీత మాట్లాడింది. ఇప్పుడు ఆ విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వృత్తిగతంగా రష్మిక, దుల్కర్‌లను స్ఫూర్తిగా తీసుకుంటానని మృణాల్ ఆ ఇంటర్వ్యూలో చెప్పింది.


'సీతారామం' సినిమా తన జీవితాన్ని మలుపు తిప్పిందని, అందులో తనతో నటించిన రష్మిక, దుల్కర్ సల్మాన్ నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను అని చెప్పింది మృణాల్. సినిమాలు, కథల ఎంపికలో ఎంపికలో రష్మిక చాలా స్పెషల్‌గా ఉంటుందన్న మృణాల్%ా% అఫ్రీన్ పాత్ర చేయాలంటే చాలా ధైర్యం కావాలని చెప్పింది. సెట్‌లో ఎన్ని గంటలు పని చేసినా ఆమెలో (%ఋంష్త్రఎఱఝ%) అలసటే కనిపించేది కాదు అని మెచ్చుకుంది.

ఇక దుల్కర్ సల్మాన్‌కు మంచి పాత్ర దొరికితే భాష ఏదైనా వెంటనే ఒప్పుకోవడం మనం చూసుంటాం. అది ఆయనకు సినిమా పట్ల అంకితభావానికి నిదర్శనం అని చెప్పింది. అందుకే తన జీవితంలో ఇద్దరినీ స్ఫూర్తిగా తీసుకొని సినిమాలను ఎంచుకుంటున్నాను అని చెప్పింది మృణాల్. ప్రస్తుతం ఆమె విజయ్ దేవరకొండతో 'ఫ్యామిలీ స్టార్' సినిమా చేస్తోంది. ఇది కాకుండా మరికొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి అంటున్నారు. వాటిలో మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' ఉందని టాక్.




# మహాశివరాత్రికి వస్తున్న అజయ్ దేవగన్ 'షైతాన్'

బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్, కోలీవుడ్ నటులు ఆర్ మాధవన్, జ్యోతిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'షైతాన్'. ఈ సినిమాకు క్వీన్, సూపర్ 30, గుడ్ బై లాంటి చిత్రాలను తీసిన వికాస్ బెహల్ దర్శకత్వం వహిస్తున్నాడు.
ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాను మహాశివరాత్రి కానుకగా మార్చి 08న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా అజయ్ దేవగన్ కొత్త పోస్టర్ విడుదల చేశారు. చేతబడులు ఆధారంగా ఈ సినిమా రానున్నట్లు తెలుస్తుంది. వెకేషన్ కోసం మారుమూల గ్రామానికి వెళ్లిన ఓ కుటుంబం.. అపరిచిత వ్యక్తి కారణంగా చిక్కుల్లో పడుతుంది.
అతను ప్రయోగించిన బ్లాక్ మ్యాజిక్ నుంచి ఆ కుటుంబం ఎలా బయటపడింది అనేది అసలు కథ. జియో స్టూడియోస్ సమర్పణలో అజయ్ దేవగన్, జ్యోతి దేశ్‌పాండే, అభిషేక్ పాఠక్ ఈ సినిమాను సంయక్తంగా నిర్మిస్తున్నారు.



# అలసిపోతేనే మంచి అనుభవమట.

ఇండియన్ సినిమాలో బోల్డ్ యాక్టర్స్ అంటూ కొంతమంది ఉంటారు. వీళ్లు సినిమాల్లో బోల్డ్ పాత్రలు చేయడమే కాదు%ా% బయట కూడా అలానే మాట్లాడుతుంటారు. అలాంటివాళ్ల నుండి వచ్చే మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

ఇలాంటి వారిలో శ్రుతి హాసన్ ఒకరు. నటిగా మాత్రమే కాకుండా సినిమాలోని వివిధ విభాగాల్లో తనకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇటీవల ఆమె తన కెరియర్ గురించి మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్లు చేసింది.

అలసిపోయిన భావం కలగనప్పుడు ఆ రోజు ఎదురైన అనుభవం సరైనది కాదు అని అనుకుంటాను అంటూ ఆసక్తికర కామెంట్స్ చేసింది శ్రుతి కమర్షియల్ కథా నాయికగా అగ్రతారల చిత్రాల్లో సందడి చేస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య సినిమాలతోనూ మెప్పిస్తోంది శ్రుతి హాసన్. ఈ రెండు ప్రయాణాల్లో మీకు సంతృప్తినిచ్చేది ఏంటి అని అడిగితే.. ఇంట్లో ఉన్నట్లు ఆఫీసులో ఉండలేం.. అక్కడ ఉన్నట్లు ఇక్కడ ఉండలేం. ఇదే సినిమాల విషయంలోనూ వర్తిస్తుంది అని చెప్పింది.

తాను ప్రధాన పాత్రలో నటిస్తున్నప్పుడు ఆ సినిమా సెట్లో ఉండే అనుభవం ఒకలా ఉంటుంది. అలాగే ఇతర తారల చిత్రాల్లో నటించేటప్పుడు అనుభవం వేరేలా ఉంటుంది. అయితే ఈ రెండింటిలోనూ తన కష్టం ఎప్పుడూ ఒకేలా ఉంటుందని క్లారిటీ ఇచ్చింది. నటిగా తన పాత్రకు న్యాయం చేయడానికి నూటికి నూరు శాతం శ్రమపడతానని చెప్పిన శ్రుతి అలా కష్టపడి పని చేయడమంటేనే తనకు ఇష్టం అని చెప్పింది.

# మార్చి 22న 'కలియుగం పట్టణంలో'..

టాలీవుడ్‌లో వండర్లు క్రియేట్ చేస్తున్న యంగ్ మేకర్లు కొత్త, భిన్నమైన కథలు, కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలు తీస్తూ విజయాలు అందుకుంటున్నారు. నిజానికి ప్రేక్షకులు సైతం కొత్త తరహా చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తున్నారు.

ఇలాంటి తరుణంలో నాని మూవీ వర్క్స్ అలాగే రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తిక్, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'కలియుగం పట్టణంలో' అనే ఓ డిఫరెంట్ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీకి కథ, డైలాగ్స్ ,స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతలను రమాకాంత్ రెడ్డి చూసుకుంటున్నారు.
రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, జి మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు కలిసి సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ మూవీలో చిత్రా శుక్లా మరో ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. టాలీవుడ్‌లో ఇది వరకు ఇలాంటి కాన్సెప్ట్‌తో సినిమాలు రాలేదని సరికొత్త పాయింట్‌తో మంచి సందేశాన్ని ఇస్తూ కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రంగా ఈ చిత్రాన్ని రూపొందించామని దర్శక నిర్మాతలు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ పూర్తయింది, కడప జిల్లాలోనే షూటింగ్‌ను ఫినిష్ చేశారు.




45 రోజుల కాల వ్యవధిలో సినిమా షూటింగ్ ఎటువంటి ఆటంకాలు లేకుండా, విజయవంతంగా పూర్తి చేశామని, అందుకు సహకరించిన యూనిట్‌కు థాంక్స్ చెప్పారు నిర్మాత. దీంతో ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మార్చి 22న ఈ మూవీని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్న మేకర్స్ త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు కూడా మొదలు పెట్టనున్నారు. ఎడిటర్‌గా గ్యారీ బీహెచ్ వంటి టాప్ టెక్నీషియన్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. అజయ్ అరసాడ సంగీతాన్ని అందించగా ఆస్కార్ అవార్డ్ గ్రహీత చంద్రబోస్, భాస్కర భట్ల వంటి వారు పాటలకు సాహిత్యాన్ని అందించారు. చరణ్ మాధవనేని కెమెరామెన్‌గా పని చేశారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఇతర ప్రమోషనల్ కార్యక్రమాలను చేపట్టనున్నారు.

# ఎస్‌బీఐ కస్టమర్లకు అదిరిపోయే శుభవార్త.. అదేంటో తెలిస్తే ఎగిరి గంతేస్తారు!

కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (PMSBY) పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇది వరకు ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే బ్యాంకుకు వెళ్లి చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. ఎస్‌బీఐ కస్టమర్లకు అదిరిపోయే శుభవార్త.. అదేంటో తెలిస్తే ఎగిరి గంతేస్తారు! కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన , ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇది వరకు ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే బ్యాంకుకు వెళ్లి చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులు ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన,




ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాల కోసం నమోదు చేసుకోవడానికి బ్యాంకు రావాల్సిన అవసరం లేదని, ఎవరికి వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ రెండు పథకాలను నమోదులో సౌలభ్యాన్ని పెంపొందించడానికి తన కస్టమర్ల కోసం మరొక ఎనేబుల్‌ను తీసుకువచ్చిందని ఎస్‌బీఐ తెలిపింది. ల బీమా చేయబడిన వ్యక్తి ఆకస్మికంగా మరణించిన సందర్భంలో పాలసీ లబ్ధిదారునికి ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం కింద రూ. 2,00,000 మరణ కవరేజీని అందిస్తుంది. ఇది ప్యూర్-టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ కాబట్టి ఎలాంటి మెచ్యూరిటీ లేదా సరెండర్ ప్రయోజనాన్ని అందించదు. ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన అనేది ప్రమాద బీమా పథకం. ఇది ప్రమాదవశాత్తు మరణం సంభవించిన సందర్భంలో లేదా వైకల్యానికి రక్షణ కల్పిస్తుంది. అయితే ఒక సంవత్సరానికి ఉంటుంది. ఆ తర్వాత ప్రతి సంవత్సరం పునరుద్ధరించుకునే అవకాశం ఉంటుంది.

# భారత కార్ల మార్కెట్‌లోకి దూసుకొస్తున్న జపాన్ కంపెనీ....





మన దేశంలోని కార్ల మార్కెట్‌పై మరో విదేశీ కంపెనీ కన్నేసింది. ఇక్కడి లోకల్ కంపెనీతో టై అప్ అయ్యి తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాలని చూస్తోంది. ఆ కంపెనీ పేరు మిత్సుబిషి కార్ప్. ఇది జపాన్ దేశంలో ప్రముఖ ట్రేడింగ్ హౌస్. అన్ని కుదిరితే ఈ ఏడాది వేసవిలోనే మన దేశంలో కార్ల విక్రయ వ్యాపారంలోకి అడుగు పెట్టాలని యోచిస్తోంది. ఈ మేరకు దేశంలోని కార్ల డీలర్‌షిప్‌లను నిర్వహిస్తున్న ప్రధాన కార్ల విక్రయదారు టీవీఎస్ మొబిలిటీలో 30 శాతానికి పైగా వాటాను కొనుగోలు చేసింది. ఈ మేరకు తన కార్యకలాపాలను ఈ వేసవి నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పలు ఆన్ లైన్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మిత్సుబిషి చేసుకున్న ఒప్పందం ప్రకారం టీవీఎస్ మొబిలిటీ తన కార్ల విక్రయ వ్యాపారాన్ని నిలిపివేయాల్సి ఉంది. మిత్సుబిషి టీవీఎస్ సంస్థలో 30 శాతానికి పైగా వాటాను తీసుకుంటుంది అంటే పెట్టుబడి 5 బిలియన్ల నుండి 10 బిలియన్ యెన్ (33 మిలియన్ డాలర్ల నుంచి 66 మిలియన్ డాలర్లు) మధ్య ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# గూగుల్‌లో వేతనాలు మూడు రెట్లు పెంపు...!





ద్రవ్యోల్బణ భయాలు క్రమంగా పెరుగుతున్నాయి. దాంతో చాలా టెక్ కంపెనీలు కాస్ట్‌కటింగ్ పేరిట ఉన్న ఉద్యోగులకు ఉద్వాసన పలకడం, వేతనాల్లో కోత విధించడం వంటి చర్యలకు పూనుకుంటున్నాయి. అందుకు భిన్నంగా గూగుల్ కీలక నిర్ణయం తీసుకుంటుంది. మంచి నైపుణ్యాలు కలిగి ఉండే ఉద్యోగార్థులకు మరింత జీతం ఎక్కువ ఇచ్చైనా వారి సేవలు వినియోగించుకునేందుకు ముందుకొస్తుంది. తాజాగా ఒక నిపుణుడిని అట్టేపెట్టుకునేందుకు టెక్ దిగ్గజం గూగుల్ అతడి జీతాన్ని 300 శాతం పెంచేందుకు సిద్ధమయ్యింది. గూగుల్‌లో పనిచేస్తున్న సదరు నిపుణుడు పర్‌ప్లెక్సిటీ ఏఐకి మారాలని నిర్ణయించుకున్నాడు. దాంతో గూగుల్ అతడి జీతాన్ని గణనీయంగా పెంచడం ద్వారా ఆ ఉద్యోగ మార్పును నిలువరించిందని పర్‌ప్లెక్సిటీ సీఈఓ అరవింద్ శ్రీనివాస్ ఇటీవల బిగ్ టెక్నాలజీ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. ఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి అయిన శ్రీనివాస్ 'ప్రధాన టెక్ కంపెనీలు తమ కీలక నిపుణులను నిలబెట్టుకునేందుకు ఎలా ప్రవర్తిస్తాయన్న విషయాన్ని' వివరించేందుకు ఉదాహరణగా ఈ సంఘటనను తెలిపారు. ఆ నిపుణుడికి కృత్రిమమేధ (ఏఐ) విభాగంతో ప్రత్యక్ష సంబంధం లేదనీ, సెర్చ్ బృందంలో సభ్యుడిగా ఉన్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు. అయినా, ఏఐ సంస్థకు మారేందుకు ప్రయత్నించినప్పుడు గూగుల్ ఈ చర్యలకు పూనుకుందన్నారు.

# పాకిస్థాన్‌ను మించిన టాటా గ్రూప్ మార్కెట్ సంపద



టాటా గ్రూప్ మొత్తం మార్కెట్ విలువ 365 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది మన పొరుగు దేశం పాకిస్థాన్ మొత్తం ఆర్థిక వ్యవస్థ విలువ కంటే ఎక్కువ. సంవత్సర కాలంలో టాటా గ్రూప్ సంస్థల మార్కెట్ విలువ గణనీయంగా పెరిగింది. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు అనేక రంగాల్లో టాటా గ్రూప్ వ్యాపారాలు విస్తరించి ఉన్నాయి. అత్యధిక ద్రవ్యోల్బణం, రుణాల ఊబిలో కూరుకుపోయిన పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కంటే టాటా గ్రూప్ మార్కెట్ సంపద ఎక్కువగా ఉంది. పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ మొత్తం విలువ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా ప్రకారం 341 బిలియన్ డాలర్లుగా ఉంది. అంత కంటే ఎక్కువగా టాటా గ్రూప్ విలువ 365 బిలియన్ డాలర్లు (30 లక్షల కోట్లు)గా ఉంది. టాటా గ్రూప్‌లోని స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన కంపెనీల్లో అత్యంత కీలకమైనది టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్). టీసీఎస్ మార్కెట్ సంపద విలువ 15 లక్షల కోట్లు (170 బిలియన్ డాలర్లు)గా ఉంది. ఇది మొత్తం టాటా గ్రూప్ సంపదలో సగం. అదే సమయంలో ఒక్క టీసీఎస్ మార్కెట్ సంపదే మొత్తం పాకిస్థాన్ మార్కెట్ విలువలో సగం ఉంది. టాటా గ్రూప్ సంపద పెరుగుదలలో టాటా మోటార్స్, ట్రెంట్ బాగస్వామ్యం కూడా ఎంతో కీలకమైనది. ఈ సంవత్సర కాలంలో టాటా మోటార్స్ షేర్లు 110 శాతం పెరిగాయి. ట్రెంట్ మార్కెట్ విలువ 200 శాతం పెరిగింది. వీటిత పాటు టాటా గ్రూప్‌లోని టాటా టెక్నాలజీస్, టీఆర్ఎఫ్, బెనారస్ హోటల్స్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పోరేషన్, ఆటో మొబైల్ కార్పోరేషన్ ఆఫ్ గోవా, ఆస్ట్రాన్ ఇంజినీరింగ్ షేర్లు కూడా మంచి పనితీరును కనబరిచాయి. స్టాక్ మార్కెట్‌లో టాటా గ్రూప్‌లోని 25 కంపెనీలు లిస్టయ్యాయి. ఇందులో ఒక్క టాటా కెమికల్స్ షేర్లు మాత్రమే ఈ కాలంలో 5 శాతం తగ్గాయి. టాటా గ్రూప్‌లో స్టాక్ మార్కెట్‌లో లిస్టు కాని కంపెనీలు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. సంవత్సర కాలంలో టాటా గ్రూప్ సంస్థల మార్కెట్ విలువ గణనీయంగా పెరిగింది. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు అనేక రంగాల్లో టాటా గ్రూప్ వ్యాపారాలు విస్తరించి ఉన్నాయి. అత్యధిక ద్రవ్యోల్బణం, రుణాల ఊబిలో కూరుకుపోయిన పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కంటే టాటా గ్రూప్ మార్కెట్ సంపద ఎక్కువగా ఉంది. పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ మొత్తం విలువ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా ప్రకారం 341 బిలియన్ డాలర్లుగా ఉంది.

# హోమ్‌లోన్ చెల్లింపు ముఖ్యమా..? పెట్టుబడి ముఖ్యమా? నిపుణుల షాకింగ్ సూచనలు



మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం, గృహ రుణాన్ని ముందస్తుగా చెల్లించడం మధ్య నిర్ణయాన్ని నావిగేట్ చేయడానికి ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ టాలరెన్స్, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులతో సహా వివిధ అంశాలను జాగ్రత్తగా పరిశీలించడం అవసరం. ఒకే పరిమాణానికి సరిపోయే సమాధానం లేనప్పటికీ ప్రతి ఎంపికకు సంబంధించిన మెరిట్‌లు, లోపాలను అర్థం చేసుకోవడం ద్వారా మీ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడంలో మీకు సహాయపడుతుంది. పెట్టుబడి అనేది ఆర్థిక భద్రతకు చిహ్నమని నిపుణులు భావిస్తూ ఉంటారు. అయితే చాలా మంది అప్పులు ఉన్న సమయంలో పెట్టుబడిపై పెద్దగా ఆసక్తి చూపించారు.

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం, గృహ రుణాన్ని ముందస్తుగా చెల్లించడం మధ్య నిర్ణయాన్ని నావిగేట్ చేయడానికి ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ టాలరెన్స్, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులతో సహా వివిధ అంశాలను జాగ్రత్తగా పరిశీలించడం అవసరం. ఒకే పరిమాణానికి సరిపోయే సమాధానం లేనప్పటికీ ప్రతి ఎంపికకు సంబంధించిన మెరిట్‌లు, లోపాలను అర్థం చేసుకోవడం ద్వారా మీ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడంలో మీకు సహాయపడుతుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల సంపద చేరడం, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఒక బలవంతపు అవకాశం లభిస్తుంది. మ్యూచువల్ ఫండ్‌లు రిటైల్ పెట్టుబడిదారులకు వైవిధ్యం, ప్రాప్యతను అందించే ప్రాధాన్యత కలిగిన పెట్టుబడి మార్గంగా ప్రజాదరణ పొందాయి.

# ముంచుకొస్తున్న గడువు... ఈ సింపుల్ చర్యలతో పన్ను ఆదా సాధ్యం




పన్ను పొదుపు కోసం వివిధ ఎంపికల ద్వారా గణనీయమైన మొత్తంలో డబ్బు ఆదా అవుతుంది. మీ పన్ను-పొదుపు పెట్టుబడులను చేసే ముందు మీరు పెట్టుబడి పెట్టవలసిన ఖచ్చితమైన మొత్తాన్ని నిర్ణయించుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పాత పన్ను విధానాన్ని ఎంచుకునే పన్ను చెల్లింపుదారులు జీవిత బీమా ప్రీమియం, ట్యూషన్ ఫీజులు, హోమ్ లోన్ ప్రిన్సిపల్ రీపేమెంట్, సెక్షన్ 80 సీ కింద వీటిపై రూ. 1.5 లక్షల వరకు ఆదా చేయడం ద్వారా పన్నులను ఆదా చేయవచ్చు. ప్రస్తుత ఆర్థిక ముగింపునకు కేవలం 40 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున పన్ను చెల్లింపుదారులు చివరి నిమిషంలో ఆదాయపు పన్ను ఎలా ఆదా చేయాలి? అనే అంశం ఎక్కువగా ఆధారపడుతున్నారు. సరిగ్గా ప్లాన్ చేస్తే ఆదాయపు పన్ను పొదుపు కోసం వివిధ ఎంపికల ద్వారా గణనీయమైన మొత్తంలో డబ్బు ఆదా అవుతుంది. మీ పన్ను-పొదుపు పెట్టుబడులను చేసే ముందు మీరు పెట్టుబడి పెట్టవలసిన ఖచ్చితమైన మొత్తాన్ని నిర్ణయించుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పాత పన్ను విధానాన్ని ఎంచుకునే పన్ను చెల్లింపుదారులు జీవిత బీమా ప్రీమియం, ట్యూషన్ ఫీజులు, హోమ్ లోన్ ప్రిన్సిపల్ రీపేమెంట్, సెక్షన్ 80 సీ కింద వీటిపై రూ. 1.5 లక్షల వరకు ఆదా చేయడం ద్వారా పన్నులను ఆదా చేయవచ్చు. ఈ నేపథ్యంలో పన్ను ఆదా గురించి నిపుణులు సూచనలు ఓ సారి తెలుసుకుందాం. ఆదాయపు పన్ను ఆదా కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉత్తమ సాధనాల్లో ఒకటి. పన్ను ఆదా ఎఫ్‌డీ పథకాలు ఐదు సంవత్సరాల లాక్ ఇన్ వ్యవధిని కలిగి ఉంటాయి, ఈ సమయంలో పెట్టుబడి పెట్టిన నిధులు అందుబాటులో ఉండవు.

# తగ్గిన షుగర్ ఉత్పత్తి.. ధరలు మరింత పెరిగే అవకాశం



దేశంలో ఫిబ్రవరి 15 నాటికి షుగర్ ఉత్పత్తి 2.48 శాతం తగ్గి 22.36 మిలియన్ టన్నులుగా ఉంది. 2022-23 సంవత్సరంలో 22.93 మిలియన్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. షుగర్ మార్కెటింగ్ సంవత్సరం అక్టోబర్-సెప్టెంబర్ వరకు ఉంటుంది. 2023-24 సంవత్సరం మార్కెటింగ్ సంవత్సరంలో షుగర్ ఉత్పత్తి 33.05 మిలియన్ టన్నులు వస్తుందని ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్ (ఐఎస్ఎంఏ) అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం ఇది 36.62 మిలియన్ టన్నులుగా ఉంది. ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరంలో మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడులో ఇప్పటి వరకు షుగర్ ఉత్పత్తి గతంతో పోల్చితే తక్కువగానే ఉంది. చెరకు సాగులో రెండో స్థానంలో ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో ఈ మార్కెటింగ్ సంవత్సరంలో గతం కంటే ఎక్కువగా 6.77 మిలియన్ టన్నుల ఉత్పత్తి వస్తుందని ఐఎస్ఎంఏ అంచనా వేసింది. అంతకు ముందు సీజన్‌లో యూపీలో 6.12 మిలియన్ టన్నులు ఉత్పత్తి వచ్చింది. దీని ప్రభావంతో దేశంలో షుగర్ ధరలు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణ కోసం ఎగుమతులపై ఆంక్షలు విధించింది.

గరుడ వార్త


# మేడారం జాతరకు పోటెత్తిన భక్తజనం..

## వారందరికీ 4 రోజులు సెలవులు



శివసత్తుల పూనకాలు, పొర్లు దండాలు, బెల్లం ఘుమఘుమలు, బంగారం మొక్కులు..! గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే వనదేవతల పండగ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర కోలాహలంగా సాగుతోంది.

వనంలో ఉన్న దేవతలు.. జనం మధ్యకు రావడంతో జాతరకు పూనకం పుట్టింది. జంపన్నవాగు జనసంద్రమైంది. కీకారణ్యం.. జనారణ్యమై కోలాహలంగా మారింది. భావోద్వేగం కట్టలు తెంచుకుంది. సల్లంగా సూడు తల్లీ అంటూ శరణు ఘోషలతో దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. డప్పు వాద్యాలు, సంప్రదాయ నృత్యాల మధ్య సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకున్నారు. ఇలవేల్పులైన తల్లులకు భక్తులు జంపన్న వాగులో పవిత్ర స్నానాలాచరించి నిలువెత్తు బంగారం, పసుపు, కుంకుమ సమర్పిస్తున్నారు. శివసత్తులు, ఓడిబియ్యం, చీరే సారెలతో తల్లుల ముందు ప్రణమిల్లుతున్నారు. ఇక వరాల తల్లి సమ్మక గురువారం మేడారం గద్దెలపైకి రానున్నది. ఇద్దరు వన దేవతలు గద్దెలపై ఉండే శుక్రవారం మేడారం మొత్తం భక్తులతో కిటకిటలాడుతుంది. శనివారం వన దేవతలు గద్దెలపై నుంచి వనంలోకి వెళ్లడంతో జాతర ముగుస్తుంది. మేడారం జాతర నేపథ్యంలో ములుగు జిల్లాలో ఉన్నటువంటి స్కూల్స్, కాలేజీలకు సెలవులు ప్రకటించారు. నాలుగు రోజులపాటు సెలవులు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. సండే కూడా సెలవు కావడంతో వరుసగా 5 రోజులు సెలవులు వచ్చాయి. మేడారం జాతర కోసం దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు పార్కింగ్ తదితర చిన్న, చిన్న సమస్యలు ఎదురైనప్పటికీ, తాగునీరు, వసతి, పారిశుధ్ధ్య సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జాతరకు వచ్చేందుకు ప్రత్యేక బస్సులతో పాటు పర్యాటక శాఖ హెలికాప్టర్ల సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఇక మేడారం జాతర నిర్వహణకు కేంద్రం 3.14 కోట్ల నిధుల కేటాయించింది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి రూ.2.30 కోట్లు, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నుంచి రూ. 0.84 కోట్ల నిధులు విడుదల చేసింది. మేడారం మహాజాతరకు ముందే లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. దూరప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలు లెక్కచేయక తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ నాలుగు రోజుల్లో కోటిపైన భక్తులు దర్శించు కోనున్నారు. అమ్మల రాక చీకటిని చీల్చుకుంటూ వెలుగులు విరజిమ్మతుంది. రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ జాతరలో ప్రతి ఘట్టం.. గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతుంది.

# మనీ లాండరింగ్ కేసులో సినీ నటి అరెస్ట్..

ప్రముఖ నటి, బిజేపి నాయకురాలు జయలక్ష్మిని తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. నిధుల దుర్వినియోగానికి, డాక్యుమెంట్ల ఫోర్జరీకి పాల్పడినట్లు వచ్చిన అభియోగాలపై ఎగ్మూర్ కోర్టు ఆదేశాల మేరకు ఆమెను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సినీ గేయ రచయిత, మక్కల్ నీతి మయ్యం నాయకుడు అయిన స్నేహన్ గతంలో స్నేహం ఫౌండేషన్ పేరిట ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. తన ఫౌండేషన్ తరఫున జయలక్ష్మి సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు తెరిచి డబ్బు వసూలు చేస్తోందని స్నేహన్ ఎగ్మూర్ కోర్టులో కేసు వేశారు. కాగా తన పరువును దెబ్బతీసే ఉద్దేశంతో స్నేహన్ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడంటూ జయలక్ష్మి కూడా గతంలో కోర్టుకెక్కారు. తాజాగా ఎగ్మూర్ కోర్టు ఆదేశాల ప్రకారం తిరుమంగళం పోలీసులు జయలక్ష్మిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ సమయంలో జయలక్ష్మి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసు వ్యాన్ లో తాను రానంటూ ఆమె తన సొంత కారులోనే పోలీస్ స్టేషన్ కు వెళ్లారు.



గతంలో జయలక్ష్మి చెన్నై90వ వార్డులో బిజేపి తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఇక స్నేహన్.. పరంపోరుల్ అనే మూవీకి పాటలు రాయడం ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చారు.

# కుప్పంలో చంద్రబాబు బదులు నేను పోటీ చేస్తా : నారా భువనేశ్వరి

అమరావతి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సరదా వ్యాఖ్య చేసి హాట్ టాపిక్‌గా మారారు. నిజాన్ని గెలిపిద్దాం అనే కార్యక్రమంలో భాగంగా ఏపీలోని చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబుకు రెస్ట్ ఇచ్చి ఈసారి తాను కుప్పం నుంచి పోటీ చేస్తా. ఎవరికి చంద్రబాబు కావాలో చేతులెత్తాలని కోరగా అందరు చేతులెత్తారు. మరి నేను అనగా మీరు కూడా కావాలని ప్రజలనుంచి సమాదానం రావడంతో ఇక ఆమె అసలు విషయాన్ని వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన తనకు లేదని, కేవలం సరదా కోసమేనని అన్నారు. నాకు ఎలాంటి పదవులు వద్దని, చంద్రబాబు నన్ను బాగా చూసుకుంటున్నారని తెలిపారు. నా కంపెనీలో చాలా సంతోషంగా ఉన్నానని అన్నారు. ఎప్పుడు సీరియస్‌గా



మాట్లాడితే బాగోదని, జోక్‌గా అంటున్నానని, సీరియస్‌గా తీసుకోవద్దని, చంద్రబాబే కుప్పంలో ఉంటారని మరోసారి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌తో ఎస్పీ పొత్తు ఖరారు : యూపీలో కాంగ్రెస్‌కు 17 స్ధానాలు ఆఫర్ చేసిన అఖిలేష్

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు ఖరారైంది. ఇండియా విపక్ష కూటమిలో భాగంగా ఇరు పార్టీలు ఎన్నికల్లో కలిసి పోటీచేస్తాయని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. పొత్తులో భాగంగా యూపీలో 17 ఎంపీ సీట్లను కాంగ్రెస్‌కు కేటాయించేందుకు అఖిలేష్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇరు పార్టీల మధ్య పొత్తుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కీలక పాత్ర పోషించారు. యూపీలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటుపై గత రెండు, మూడు రోజులుగా సంప్రదింపులు జరుగుతున్నాయి. అధిక స్థానాలకు కాంగ్రెస్ పట్టుబట్టడంతో సీట్ల సర్దుబాటులో జాప్యం నెలకొంది. ఇక ఇరు పార్టీల పొత్తుపై ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించడంతో ప్రతిష్టంభనకు తెరపడింది. కాంగ్రెస్, ఎస్పీ మధ్య పొత్తు ఖరారు కావడంతో రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేష్ యాదవ్ పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.



# ఉళ్లల్లోకి రానివ్వం, దెబ్బకు దెబ్బే

బాగ్‌పట్ : డిమాండ్ల సాధనకు రైతులను ఢిల్లీకి వెళ్లనివ్వకపోతే , లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి నేతలను ఊర్లలోకి రాకుండా అడ్డుకుంటారని రైతు నేత రాకేష్ తికాయత్ బుధవారం హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ చర్యకు రైతుల నుంచి ప్రతిచర్య తప్పదని భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు) జాతీయ ప్రతినిధి అయిన తికాయత్ తెలిపారు. ఎన్నికల దశ వస్తోంది. ఓట్ల అడగటానికి నేతలు తమ వద్దకు ఎట్లావస్తారో చూస్తామని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో బుధవారం రైతులు కలెక్టర్ కార్యాలయం వరకూ ట్రాక్టర్లతో నిరసన యాత్ర చేపట్టారు. పలు చోట్ల బ్యానర్లు వెలిశాయి. రైతుల దారిలో మేకులు ముళ్లు దించుతున్నారు. వారిని ముందుకు వెళ్లకుండా చేస్తున్నారు. దీనికి ప్రతిగా తాము కూడా వారి వాహనాలు ఊర్లలోకి రాకుండా చేయగలం అని , దెబ్బకు దెబ్బ తప్పదని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేవలం కొందరు



# ప్రమాదమా? కుట్ర కోణమా?

## ప్రభుత్వం విచారణ చేపట్టాలి : వినోద్‌కుమార్



కార్పొరేషన్,: అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా..? లేక ఏమైనా కుట్ర కోణం ఉన్నదా..? అన్న కోణంలో పోలీసులు పూర్తి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ 42వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, ఆదర్శనగర్ మధ్య మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగి గుడిసెలు బుగ్గి కాగా, బుధవారం బాధితులను ఆయన పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణ అవసరాల కోసం లక్ష ఆర్థిక సాయం అందించారు. అధైర్య పడొద్దని, పేదలను ఆదుకునేందుకు అన్ని విధాలుగా సాయం చేస్తామని భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించి తగిన న్యాయం చేయాలని కోరారు. బాధితులకు వెంటనే తాత్కలికంగా నివాసాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. అందుకు తాము కృషి చేస్తామని చెప్పారు. ముప్పై ఏండ్లుగా ఈ నిరుపేదలు ఇక్కడే జీవిస్తున్నారని, గతంలో చాలా మంది వచ్చి ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని వారిని ప్రలోభాలకు గురి చేశారని పేర్కొన్నారు. కూలీల గుడిసెలు అగ్నిప్రమాదంలో దగ్ధం కావడం బాధకరమని ఆవేదన చెందారు. పేదలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని మేయర్ సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్ వనజ అశోక్‌రావుకు సూచించారు. ప్రమాద శకలాలను తొలగించి నివాసం ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట మేయర్ సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్ వనజ అశోక్‌రావు, బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, పెండ్యాల మహేశ్ కుమార్ పాల్గొన్నారు.

# మార్చి 3న కేంద్ర మంత్రిమండలి భేటీ



న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి మండలి సమావేశం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన మార్చి 3వ తేదీన జరుగుతుంది. దీనికో ప్రత్యేకత ఉంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు జరిగే తుది మంత్రివర్గ సమావేశం ఇదే అవుతుంది. ఈ విషయాన్ని అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఈ సారి మంత్రివర్గ సమావేశం చాణక్యపురి డిప్లొమాటిక్ ఎన్‌క్లేవ్‌లోని సుష్మా స్వరాజ్ భవన్‌లో జరుగుతుంది. దాదాపుగా ప్రతివారం ప్రధాని అధ్యక్షతన మంత్రి మండలి భేటీ, ఇందులో కీలక విధాన విషయాలపై చర్చ, తరువాత కొన్ని నిర్ణయాల ప్రకటన జరుగుతుంది. ప్రతి సారి కేబినెట్ భేటీలో ప్రధాని పాలనా వ్యవహారాలపై తమ అభిప్రాయాలు తెలియచేయడం, తగు సూచనలు తమ బృందానికి వెలువరించడం అంతర్గతంగా జరుగుతుంది. ఈసారి జరిగే సమావేశంలో ఎన్నికల సంసిద్ధత గురించి కూడా విశ్లేషించుకునే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాల పట్ల జనం స్పందన, వీటి గురించి కార్యక్షేత్రంలో సమగ్రరీతిలో ప్రచారానికి ఇప్పటి భేటీలో ప్రధాని తగు సూచనలు వెలువరిస్తారని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు జరిగే భేటీ సుదీర్ఘం అవుతుందని వెల్లడైంది. కాగా లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘం వివిధ రాష్ట్రాలవారిగా సంసిద్ధతపై సమీక్షలు చేపట్టింది. వచ్చే నెల మధ్యలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడే వీలుంది. 2014లో తొమ్మిది దశల ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 5వ తేదీన ఎన్నికల సంఘం వెలువరించింది. ఫలితాలు మే 16వ తేదీన వెలువడ్డాయి. 2019లో ఏడు దశల షెడ్యూల్‌ను మార్చి 10వ తేదీన విడుదల చేశారు. ఫలితాలు మే 23న ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ మార్చి పది నుంచి పదిహేనులోపు ఎప్పుడైనా వెలువడే అవకాశం ఉంది.

# బిఆర్ఎస్ కు ఒక్క సీటు రాకున్నా.. వచ్చే నష్టం లేదు: కిషన్ రెడ్డి

తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై విరుచుకుపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ తో పోటీ పడాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ కు ఈ ఎన్నికల్లో పోటీకి ఎలాంటి అజెండా లేదని చెప్పారు. బిఆర్ఎస్ ఒక్క సీటు రాకున్నా జనానికి వచ్చే నష్టం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ లో అన్ని ఎంపి సీట్లు గెలుస్తున్నామని ఆయన వెల్లడిచారు. కర్నాటకలో



25 సీట్లు బిజెపి గెలవబోతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ 3-4 సీట్లు గెలిచినా రాష్ట్రానికి ప్రయోజనం ఉండదని చెప్పారు. మోడీని మరోసారి ప్రధాని కాకుండా ఎవరూ ఆపలేరని కిషన్ రెడ్డి జోస్య చెప్పారు. తెలంగాణలో అత్యధిక సీట్లు బిజెపి గెలవకుండా ఏ శక్తి అడ్డుకోలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. అలవికాని హామీలిచ్చి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు.

# కుదిరిన డీల్.. పాక్ ప్రధానిగా షెహబాజ్, అధ్యక్షుడిగా జర్దారి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ఏర్పడిన రాజకీయ అనిశ్చితికి తెరపడింది. వారం రోజుల హై టెన్షన్‌కు.. రెండు పార్టీలు ఫుల్‌స్టాప్ పెట్టేశాయి. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో పీపీపీ, పీఎంఎల్-ఎన్ మధ్య ఒప్పందం కుదిరింది. మంగళవారం అర్ధరాత్రి ఇస్లామాబాద్‌లోని జర్దారి ఇంట్లో మీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)



చైర్మెన్ బిలావాల్ భుట్టో జర్దారి కీలక ప్రటకన చేశారు. పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్(పీఎంఎల్-ఎన్) పార్టీ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్ దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పీఎంఎల్-ఎన్, పీపీపీ వద్ద కావాల్సినంత సభ్యులు ఉన్నట్లు భుట్టో తెలిపారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com